నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 22-10-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 73 | పేజీలు: 4 | వెల: రూ.1/-

హైదరాబాదును ముంచెత్తనున్న భారీ వర్షాలు

అల్పపీడన ప్రభావంతో 24 వరకు వానలు

హైదరాబాద్,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): ఇప్పటికే భారీ వర్షాల కారణంగా హైదరాబాద్ తడిసి ముద్దయ్యింది. సాధారణ స్థాయి కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. తాజాగా వాతావరణ శాఖ మరో హెచ్చరిక జారీ చేసింది. హైదరాబాదులో ఈ నెల 24వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి వల్ల వర్షాలు కురుస్తాయని తెలిపింది. ద్రోణి ప్రభావం వల్ల నిన్న నగరంలో 40 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉపరితల ద్రోణి ప్రభావంతో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ లో కూడా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. భారీ వర్షాల నేపథ్యంలో, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.

ప్రగతిభవన్ ముట్టడికి

కాంగ్రెస్ నేతల విఫలయత్నం

■ముఖ్యనేతలను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

■ ప్రగతిభవన్ వద్ద కాంగ్రెస్ నేతల అరెస్టు

■బైక్‌పై దూసుకొచ్చిన రేవంత్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

■ప్రగతి భవన్ గోడలు బద్దలు కొట్టడం ఖాయమన్న రేవంత్

- కేసీఆర్‌కు అహంకారం తలకెక్కింది - షబ్బీర్ అలీ

హైదరాబాద్, అక్టోబర్21(ఆర్ఎన్ఎ) : తెలంగాణా ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 'చలో ప్రగతి భవన్' ఉద్రిక్తంగా మారింది. సోమవారం ప్రగతి భవన్ ముట్టడికి కాంగ్రెస్ నేతలు యత్నించడంతో వారిని పోలీసులు అడ్డుకున్నారు. ప్రగతిభవన్ వద్ద పార్టీ నేతలు అంజన్‌కుమార్ యాదవ్, విక్రం గౌడ్, రాములు నాయక్‌ను బలవంతంగా అదుపులోకి తీసుకుని అక్కడ నుంచి తరలించారు. మరోవైపు కాంగ్రెస్ నేతలను తెలంగాణవ్యాప్తంగా ఎక్కడికక్కడ హౌస్ అరెస్ట్‌లతో, ముందస్తుగా అదుపులోకి తీసుకుంటున్నారు. పలువురి ముఖ్యనేతలను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. మరోవైపు ఎంపీ రేవంత్ రెడ్డి నివాసంతో పాటు, ఆయన అనుచరుల ఇళ్లలోనూ తనిఖీలు నిర్వహించారు. ఇక మల్‌రెడ్డి రంగారెడ్డి నివాసాన్ని కూడా పోలీసులు చుట్టుముట్టడంతో ఆయన పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. ఇక ఆర్టీసీ కార్మికుల సమ్మె ఉధృతం కావడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా ప్రగతి భవన్ వద్ద పోలీసులు భారీగా మోహరించి, గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. కాంగ్రెస్ మాజీ మంత్రి శ్రీధర్ బాబును హౌస్ అరెస్ట్ చేశారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్కను తొలుత వేర్వేరు ప్రాంతాలకు తరలించిన పోలీసులు.. ఆ తర్వాత భట్టిని ఇంటికి తీసుకొచ్చి గృహనిర్బంధం చేశారు. అంతేకాకుండా పార్టీ సీనియర్ నేతలు పొన్నాల లక్ష్మయ్య, పొన్నం ప్రభాకర్, జానారెడ్డి, రాములు నాయక్‌లను కూడా పోలీసులు గృహనిర్బంధం చేశారు. కూకట్‌పల్లి, నిజాంపేట, బాలానగర్, సనత్‌నగర్ పరిధిలో 20 మంది కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు వివిధ జిల్లాల్లోనూ కాంగ్రెస్ నేతల నిరసనలు కొనసాగాయి. ఖమ్మం జిల్లా ఇల్లందులో ప్రగతిభవన్ ముట్టడికి వెళ్తున్న కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల, సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు, బీడీఎల్ భానూర్, జిన్నారం, గుమ్మడిదలలో పలువురు కాంగ్రెస్ నేతలు అరెస్టయ్యారు. జగిత్యాలలో 20 మంది కాంగ్రెస్ నేతలు అరెస్టయ్యారు. సమ్మె ఉధృతరూపం దాల్చుతున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రగతిభవన్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దోమలగూడలో మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి ని కూడా హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు. రంగారెడ్డి జిన్నారం (మం) కాంగ్రెస్ నాయకులు ప్రగతి భవన్ ముట్టడికి బయలుదేరగా, వారిని పోలీసులు మధ్యలోనే అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ప్రగతి భవన్ ముట్టడి నేపథ్యంలో మెదక్ జిల్లా నర్సాపూర్‌లో పలువురు కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ హౌస్ అరెస్ట్ అయ్యారు. హైదరాబాద్ మణికొండలోని స్వగృహంనందు పోలీసులు ఆయనను హౌస్ అరెస్టు చేశారు. మరోవైపు పోలీసుల కళ్లు గప్పి కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి ప్రగతి భవన్ ముట్టడికి యత్నించారు. ప్రగతి భవన్ సమీపంలోని ఓ హోటల్‌కు ఆయన చేరుకున్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రగతి భవన్ వద్ద నిరసన తెలిపి తీరుతామని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. కోర్టు ఆదేశాలను కూడా ప్రభుత్వం లెక్కచేయడం లేదన్నారు. ప్రభుత్వ తీరుతో జనాల్లోకి తప్పుడు సంకేతాలు పంపిస్తున్నారని జగ్గారెడ్డి తెలిపారు. ప్రభుత్వాలే కోర్టులను గౌరవించకపోతే ఎలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పోలీస్ పాలన నడుస్తోందా అని జగ్గారెడ్డి ప్రశ్నించారు.

బైక్‌పై దూసుకొచ్చిన రేవంత్‌రెడ్డి..

ఆర్టీసీ కార్మికుల సమ్మెపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన చలో ప్రగతి భవన్ ఉద్రిక్తంగా మారింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులను పోలీసులు ఎక్కడి అక్కడ అదుపులోకి తీసుకుంటారు. మరికొందరు నేతలను హౌస్ అరెస్ట్‌లు చేస్తున్నారు. అయితే కాంగ్రెస్ ఫైర్‌బ్రాండ్ రేవంత్ రెడ్డి మాత్రం పోలీసులను బురిడి కొట్టించారు. పోలీసులు హౌస్ అరెస్ట్ చేసినప్పటికీ వారిని తోసుకుంటూ ఇంటి బయటకు వచ్చారు. అక్కడి నుంచి వేగంగా ముందుకు సాగిన రేవంత్.. అక్కడి నుంచి బైక్‌పై వెళ్లిపోయాడు. నేరుగా ప్రగతి భవన్ వద్దకు చేరుకున్నారు. బైక్‌పై దూసుకొచ్చిన రేవంత్‌ను ప్రగతి భవన్ సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో ప్రగతిభవన్ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ శ్రేణులు పోలీసులకు మధ్య తీవ్ర తోపులాట చోటు చేసుకుంది. పరిస్థితి విషమిస్తుండటంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులతో సీఎం కేసీఆర్ వెంటనే చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. పరిస్థితులు కొనసాగితే.. తెలంగాణలోని నాలుగు కోట్ల మంది ప్రజలు ప్రగతి భవన్ గోడలు బద్దలు కొట్టడం ఖాయమని అన్నారు. ప్రగతి భవన్ గేట్లను తాకుతామని అన్నామని.. తాకి చూపించామని చెప్పారు.

కేసీఆర్‌కు అహంకారం తలకెక్కింది - షబ్బీర్ అలీ

అరెస్టులతో ఆందోళనలను ఆపలేరని కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై సోమవారం ప్రగతి భవన్ ముట్టడికి కాంగ్రెస్ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులు కీలక నేతలను ఎక్కడికక్కడ అరెస్ట్ చేస్తున్నారు. సందర్భంగా షబ్బీర్ అలీ మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్‌కు అహంకారం తలకెక్కి నియంతలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్మికులతో చర్చలు జరపాలని కోర్టు చెప్పినా లెక్క చేయడం లేదన్నారు. ప్రభుత్వ తీరు మారకుంటే రాష్ట్రంలో రాజ్యాంగ సంక్షోభం ఖాయమన్నారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని కూలడం ఖాయమని షబ్బీర్‌అలీ స్పష్టం చేశారు.

18నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

న్యూఢిల్లీ,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): పార్లమెంటు శీతాకాల సమావేశాలకు ముహూర్తం ఖరారు అయ్యింది. నవంబరు 18 నుంచి డిసెంబర్ 13 వరకు పార్లమెంటు సమావేశాలు జరుగుతాయని పార్లమెంటు వ్యవహారాల శాఖ తెలిపింది. ఈమేరకు సమావేశాలకు సిద్ధంగా ఉండాలని ఆయా సెక్రటేరియట్లలకు సమాచామిచ్చింది. కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్ నేతృత్వంలో జరిగిన పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ భేటీలో వింటర్ సెషన్ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశాల్లోనే కేంద్రం రెండు కీలక ఆర్డినెన్సులను చట్టంగా రూపొందించాలని ప్రభుత్వం భావిస్తోంది. దేశీయ కంపెనీలకు కార్పొరేట్ పన్ను తగ్గింపు, ఎలక్ట్రానిక్ సిగరెట్ల ఉత్పత్తి, అమ్మకం, దిగుమతి నిషేధంపై జారీ చేసిన ఆర్డినెన్స్ లను చట్టంగా మార్చాలని చూస్తోంది. ఇదిలావుంటు ఆర్థిక మందగనంతో పాటు నిరుద్యోగం తదితర సమస్యలపై అధికార పక్షాన్ని నిలదీసేందుకు విపక్షాలు సిద్ధంగా ఉన్నాయి.

ఎల్బీనగర్ చిల్డ్రన్స్ ఆస్పత్రిలో దారుణం

అగ్నిప్రమాదంలో చిన్నారి దహనం

హైదరాబాద్,అక్టోబర్21 (ఆర్ఎన్ఎ): బాలల ఆస్పత్రిలో జరిగిన అగ్ని ప్రమాదంఓల ఐదు నెలల చిన్నారి సజీవ దహనం అయ్యాడు. ఎల్ బీ నగర్‌లో గలప్లైన్ చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. హాస్పిటల్‌లోని 4వ అంతస్తులో ఐసీయూ వార్డులో ఈ ఘోర ప్రమాదం చోటు జరిగింది. ఐసీయూలో ఉన్న ఓ 5నెలల చిన్నారి అక్కడికక్కడే సజీవ దహనమయ్యాడు. మరో 5 మంది సంవత్సరం లోపు వయస్సున్న చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వేరే హాస్పిటల్‌కు తరలించినట్లు సమాచారం. ప్రమాదానికి గల కారణాలను సిబ్బంది పరిశీలిస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు. హాస్పిటల్ వద్ద చిన్నారుల తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. వారిని ఆపడం ఎవరితరం కావడం లేదు.

బంగారం కాదు ఖడ్గాలు కొనండి

ఆత్మరక్షణ ముఖ్యమన్న బిజెపి నేత

లక్నో,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): దీపావళి, ధనత్రయోదశి పండుగలను పురస్కరించుకుని హిందువులు బంగారు ఆభరణాలు, వెండి పాత్రలకు బదులు ఖడ్గాలు కొనుగోలు చేయాలని బిజెపి దేవ్‌బంద్ నగర అధ్యక్షుడు గజరాజ్ రాణా పిలుపు ఇచ్చారు. తాను గతంలో కూడా ఇదే విధంగా చెప్పానని, ఇప్పుడు కూడా ఇదే చెబుతున్నానని సంచలన వ్యాఖ్యలు చేశారు. హిందువులు దీపావళి, ధనత్రయోదశి సందర్భంగా వెండి పాత్రలు, ఆభరణాలకు బదులు ఇనుప ఖడ్గాలు కొనాలని ఆయన అన్నారు. హిందువుల భద్రతను దృష్టిలో ఉంచుకునే తాను ఈ పిలుపు ఇస్తున్నానని ఆయన అన్నారు. హిందువులు తమను తాము రక్షించుకోలేరని కాదని, కాని భద్రత కోసం ఒక ఆయుధం ఉండాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. మన దేవతలు, దేవుళ్లు కూడా ఆయుధాలు ధరించారని ఆయన గుర్తు చేశారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం త్వరితంగా మొదలు కావాలని హిందువులు అభిలషిస్తున్నారని కూడా ఆయన చెప్పారు.

ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ

ప్రజల రక్షణలో పోలీసుల త్యాగాలు అసామాన్యం

నివాళి అర్పించిన హోంమంత్రి మహ్మూద్ అలీ

-శాంతిభద్రతల రక్షణలో నిరంతరం నిమగ్నం: డిజిపి

హైదరాబాద్,అక్టోబర్21 (ఆర్ఎన్ఎ): పోలీసుల ప్రాణ త్యాగాలకు మనమెంతో రుణపడి ఉన్నామని తెలంగాణ హోంశాఖ మంత్రి మహ్మూద్ అలీ అన్నారు. మన భవిష్యత్తు కోసం వారి ప్రాణాలను త్యాగం చేశారని అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో పాల్గొని ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ సర్కార్ ప్రజల భద్రతకు పెద్దపీట వేసిందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పర్యవేక్షణ బాగుందని కితాబిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల సీసీ కెమెరాలు అమర్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. రూ. 400కోట్లతో పోలీస్ కమాండ్ కంట్రోల్ పూర్తి చేస్తామని, 800 పోలీస్ స్టేషన్లను దీనికి అనుసంధానిస్తామని అన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులు, హోంగార్డులందరికీ ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు గుర్తు చేశారు.

విధి నిర్వహణలో ఉన్న పోలీసులు తమ కర్తవ్యాన్నిగుర్తుచేసుకోవాలని డీజీపీ మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పోలీసులు శక్తి వంచన లేకుండా పని చేస్తున్నారని చెబుతూ.. వరంగల్‌లో చిన్నారి అత్యాచార ఘటనకు సంబంధించిన కేవలం 21 రోజుల్లో నిందితుని శిక్ష ఖరారైనవిషయాన్ని గుర్తు చేశారు. ఈ కేసులో పోలీసులు దర్యాప్తును కొనియాడారు. వీర మరణం పొందిన పోలీసుల కుటుంబాలను శాఖాపరంగా ఆదుకుంటున్నట్లు డీజీపీ వివరించారు. పోలీసుల కోసం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. టెక్నాలజీ సాయంతో నేరాలు నియంత్రిస్తున్నామని చెప్పారు. పోలీసులు సేవా దృక్పథంతో ప్రజల మనసు గెలవాలని డీజీపీ ఆకాంక్షించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారని మహేందర్ రెడ్డి తెలిపారు. గోషామహల్ స్టేడియంలో సోమవారం పోలీసు అమరవీరుల దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిజిపి మహేందర్ రెడ్డి పోలీసు అమరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో ఉగ్రవాదం, అసాంఘిక శక్తులు పెట్రేగిపోతున్నాయని, వారిని నిలువరించేందుకు ఎందరో పోలీసులు బలిదానం చేశారని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది 292 మంది పోలీసులు వీరమరణం పొందారని ఆయన పేర్కొన్నారు. సమాజంలో శాంతి, ప్రజల పరిరక్షణకు అవసరమైతే ప్రాణాలను ఫణంగా పెట్టేందుకు పోలీసులు వెనుకాడరని , ఈ విషయం పోలీసు అమరవీరులతో రుజువైందని ఆయన పేర్కొన్నారు. విధుల నిర్వహణలో అమరులైన పోలీసులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని ఆయన తెలిపారు.

కారివితో తలగోక్కోవద్దు

ఆర్టీసీ సమ్మెపై బిజెపి నేత

హైదరాబాద్,అక్టోబర్2 1(ఆర్ఎన్ఎ): కార్మికులతో పెట్టుకుంటే అగ్గితో గోక్కోవడమేనని బిజెపి రాష్ట్ర కార్యదర్శి ఆచారి అన్నారు. ఇచ్చిన హామీలు విస్మరించిన సిఎం కేసీఆర్ నియంతలాగా పాలన చేస్తానంటే కుదరదని అన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో రాష్ట్రం ఏర్పడగానే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పిన కేసీఆర్ ఇప్పుడు మాట తప్పారని ఆరోపించారు. ఆర్టీసీ నష్టాల్లో మునగడానికి ప్రభుత్వం చేసున్న విదానాలే ప్రధాన కారణమని ఆరోపించారు. ఇది ప్రజా రవాణా సంస్థపై పన్నుల భారం మోపుతుందని అభిప్రాయపడ్డారు. ఇక నుంచి ఆర్టీసీ కార్మికులు చేస్తున్న ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు మీ పాలనను గమనిస్తున్నారంటూ మండిపడ్డారు. టీఆర్ఎస్‌లోని కొంతమంది ఆర్టీసీ ఆస్తులను కొల్లగొడుతున్నారని బీజేపీ నేత మండిపడ్డారు. ఆర్టీసీ ఆస్తులను కాపాడాలని గవర్నర్ తమిళిసైను బిజెపి కోరినట్లు తెలిపారు. ఆర్టీసీ సమ్మె మొదలై 17 రోజులు గడిచినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని వ్యాఖ్యానించారు. మంత్రులు రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లే కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గులాబీ కండువాలే ఆర్టీసీని దోచుకుంటున్నాయని, దసరాకు 22 రోజులు సెలవులిచ్చి విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నారని విమర్శించారు. శాంతియుతంగా, ప్రజాస్వామికంగా ప్రభుత్వ మెడలు వంచుతామని పేర్కొన్నారు.

రాజకీయ పార్టీలకు ఊపిరిపోస్తున్న ఆర్టీసీ సమ్మె

ఆర్టీసీ ఆందోళనలతో ఊపందుకున్న బిజెపి రాజకీయం

తెలంగాణలో మళ్లీ ఉమ్మడి ఆందోళన దిశగా సమ్మె

హైదరాబాద్,అక్టోబర్21 (ఆర్ఎన్ఎ): ఆర్టీసీ సమ్మె రాజకీయపార్టీల్లో ఉత్సాహం నింపుతోంది. ఇంతకాలం స్తబ్దుగా ఉన్నా తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కుతున్నాయి. సిఎం కెసిఆర్ లక్ష్యంగా ఇప్పుడు అన్ని పార్టీలు ఏకమయ్యాయి. ఎన్నికలను మించిన ఐక్యతతో ముందుకు సాగుతున్నాయి. ప్రజల్లో, నిరుద్యోగుల్లో గూడుకట్టున్న అసంతృప్తి కూడా వీరికి కలసి వస్తోంది. మొన్నటివరకు రాజకీయపరంగా జిల్లాల్లో అంతా నిశ్శబ్దంగా ఉండగా నేతలంతా ఇప్పుడు మళ్లీ ఆందోళనబాట పట్టారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఏకమైన రీతిలో ప్రజలు కూడా భావిస్తున్నారు. గత ఏడాది డిసెంబర్‌లో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు రాగా.. ఆ తర్వాత ఎంపీ, ప్రాదేశిక, పంచాయతీ పోరు సాగింది. ఈ వరుస ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) రాష్ట్రంతోపాటు జిల్లాలో ప్రభంజనం సృష్టించగా.. మిగిలిన పార్టీలన్నీ చతికిలబడ్డాయి. ఈ ఏడాది మార్చి తర్వాత గులాబీ దళం మినహా ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలో స్తబ్దత కొనసాగుతూ వస్తోంది. ఈ క్రమంలో డిమాండ్ల సాధనకు ఆర్టీసీ కార్మికులు సమ్మెబాట పట్టగా.. పరిస్థితిలో ఒక్కసారిగా మార్పు వచ్చింది. సమ్మె మొదలైన రెండు, మూడు రోజుల వరకు జిల్లాల్లోని విపక్ష పార్టీల నేతలు సైతం కొంత మౌనంగానే ఉన్నారు. తాజాగా అన్ని పార్టీలు ముందుకు రావడంతో ఆర్టీసీ సమ్మె కాస్తా సకల జనుల ఆందోళనకు దారితీస్తోంది. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు కాంగ్రెస్, బీజేపీతోపాటు వామపక్ష నేతలు ఒక్కొక్కరుగా ముందుకొచ్చారు. ప్రధానంగా బీజేపీ ఆర్టీసీ సమ్మెకు సంఘీభావం ప్రకటించడమే కాకుండా.. ప్రత్యక్షంగా కార్మికుల ఆందోళనలో పాలుపంచుకుంటోంది. బిజెపి ఈ ఆందోళనలో అగ్రగాన నిలవడంతో పాటు ప్రత్యామ్నాయ పార్టీగా అవతరించింది. అన్ని జిల్లాల్లో ఇప్పుడు బిజెపి పట్ల ప్రజలు మొగ్గు చూపుతున్నారు. కాంగ్రెస్ సైతం ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు ఇచ్చినప్పటికీ.. ఆ పార్టీ స్థానిక నేతలు కేవలం సంఘీభావాలకే పరిమితవయ్యారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెను ఆయుధంగా ఉపయోగించుకుంటూ బీజేపీ, కాంగ్రెస్ మళ్లీ ప్రజాక్షేత్రంలో దూసుకెళ్లేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. తెలంగాణ రాష్ట్రంలో పాగా వేయాలనే సంకల్పంతో ఉంది. ఆ దిశగా ఆ పార్టీ జాతీయ నేతలు ఎప్పటికప్పుడు రాష్ట్ర నాయకత్వంతో టచ్‌లో ఉంటూ రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులను బేరీజు వేస్తున్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలపడంతోపాటు స్వయంగా పాల్గొని ప్రజాక్షేత్రంలో బలం పెంచుకోవాలని జాతీయ నాయకత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో బిజీగా ఉన్నప్పటికీ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌తోపాటు రాష్ట్ర నేతలు జిల్లాల్లో పర్యటిస్తూ ఆర్టీసీ కార్మికుల ఆందోళనల్లో ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. జిల్లాల్లో అన్ని స్థాయిల్లో ఉన్న నేతలు సైతం ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతి రోజూ ఏదో ఒక కార్యక్రమం చేపడుతూ దూసుకెళ్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అన్ని జిల్లాలు తిరుగుతై ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలిపారు. దీంతో ప్రతి మండలంలో పార్టీ శ్రేణులు ర్యాలీలతో హోరెత్తిస్తున్నాయి. రాష్ట్రంలో వరుస ఎన్నికల్లో ఘోర పరాజయంతో చతికిలబడి స్తబ్దుగా ఉన్న కాంగ్రెస్ నేతలు మెల్లమెల్లగా ప్రజాక్షేత్రంలోకి వస్తున్నారు. నిన్నమొన్నటి వరకు ర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ఉప ఎన్నికలకు సంబంధించి ఆ పార్టీ రాష్ట్ర నేతలు ప్రచారంలో తలమునకలై ఉన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతుప్రకటించినప్పటికీ.. ఆ పార్టీ

రాష్ట్రస్థాయి నేతలు జిల్లా వైపు చూడని పరిస్థితి నెలకొంది. అయితే కాంగ్రెస్ నాయకత్వం ఆర్టీసీ కార్మికులకు సంఘీభావం ప్రకటించి. హుజూర్ నగర్ ఎన్నిక ముగియడంతో ఇప్పుడు ప్రగి భవన్ ముట్టడిలో చురకుగా పాల్గొన్నారు. ఆర్టీసీ కార్మికుల ఆందోళనలో కాంగ్రెస్ శ్రేణులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఆ పార్టీకి చెందిన నాయకులు.. శ్రేణులతో కలిసి ప్రత్యక్ష ఆందోళనలకు దిగారు. బంద్ సందర్భంగా అన్ని పారర్టీల నేతలు అఖిలపక్షంతో కలిసి పాల్గొన్నారు. బీజేపీ నాయకులు సైతం భాగస్వాములు కావడంతోపాటు పలు మండల కేంద్రాల్లో ర్యాలీలు, రాస్తారోకోలతో హోరెత్తించారు. ఆర్టీసీ సమ్మెను ఆయుధంగా చేసుకుని ప్రజాక్షేత్రంలో బలం పెంచుకునేందుకు బీజేపీ, కాంగ్రెస్ నేతలు ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. ఆర్టీసీ కార్మికులతో మొదలైన అలజడి అన్ని వర్గాలనూ ఆలోచింప చేసింది.. దీన్ని ఆసరాగా చేసుకుని పూర్వ వైభవం దిశగా ముందుకు సాగాలని నేతలు కృత నిశ్చయంతో ఉన్నారు. బీజేపీ సైతం పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకుని బలం పెంచుకునే దిశగా అడుగులేసింది. హుజూర్‌నగర్ ఉప ఎన్నిక తర్వాత మున్సిపల్ ఎన్నికలు వస్తాయనే ఆలోచనతో ఉన్న ఆయా పార్టీల జిల్లా నాయకులు.. ఆర్టీసీ సమ్మెను ఆయుధంగా మలుచుకుని లక్ష్యం చేరుకునేందుకు వక్కా ప్రణాళికతో పోటాపోటీగా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా ఆర్టీసీ సమ్మె ఏ మలుపుతు తిరుగుతుందో కానీ విపక్షాలకుమాత్రం ఆయుధం దొరికింది. అడుగుల వేసేందుకు అవకాశం వచ్చింది.

కారులోంచి ఆరుగురు మృతదేహాల వెలికితీత

సూర్యాపేట,అక్టోబర్ 21 (ఆర్ఎన్ఎ): సూర్యాపేట జిల్లాలో నడిగూడెం మండలం చాకిరాల శివారులో గత రాత్రి కాలువలోకి దూసుకెళ్లిన కారును బయటకు తీశారు. కారులో ఆరు మృతదేహాలను ఉన్నట్టు పోలీసులు తెలిపారు. స్నేహితుడి వివాహ వేడుకకు హాజరై తిరిగి వస్తుండగా రాత్రి 12 గంటల ప్రాంతంలో రోడ్డుపై గుంతను తప్పించబోయి కారు కాలువలోకి దూసుకెళ్లింది. వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో 15 గంటల అనంతరం ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు కారును బయటకు తీశాయి. ఆరుగురు యువకులు ఒకే ఆస్పత్రిలో పని చేసేవారు. కారు బయటకు తీయగానే కుటుంబ సభ్యుల ఏడుపులు, కేకలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. కారుల నీటిలోపడడంతో అందులో ఉన్నవారంతా మృత్యువాత పడ్డారు.

రంజని,

తెలుగు సాహితి సమితి, ఏ.జి ఆఫీస్ , సైఫాబాద్ 500004

నేటినిజం దినపత్రిక -రంజని

విశ్వనాథ పద్య కవితా పోటీలు 2019

మఱల నిదేల రామాయణం బన్నచో నీ ప్రపంచక మెల్ల నెల్ల వేళ
దినుచున్న యన్నమే తినుచున్న దిన్నాళ్ళుతనరుచి బ్రదుకులు తనవిగాన
చేసిన సంసారమే సేయుచున్నది తనదైన యనుభూతి తనదిగాన
తలచిన రాముసే తలచెద నేనును నా భక్తిరచనలు నావిగాన...

అన్న"మాటలాడే వెన్నముక, పాటపాడే సుషుమ్న, నిన్నటి నన్నయ్యభట్టు, ఈనాటి కవిసామ్రాట్టు, ప్రథమ జ్ఞానపీఠ అవార్డు గ్రహీత శ్రీ విశ్వనాథ సత్యనారాయణ". ఆయన పట్టి సాధించని సాహిత్య ప్రక్రియ లేదు, మెట్టి చూడని సారస్వతమూ లేదు. "సంస్కృతంలో ఇప్పుడు వ్రాస్తే ప్రాచీన కవుల పరంపరలో ఏ వెయ్యిన్నొక్కటో వాణ్ణే అవుతాను. తెలుగులోనంటారా పన్నెండుగురు ప్రాచీన మహాకవుల తర్వాత పదమూడో వాణ్ణి నేను " అని స్వయంగా ప్రకటించుకున్నట్టి శిల్ప నైపుణ్యంలో, భావన సౌకుమార్యంలో, దళిచ్చందో విశేషంలో, కల్పనా సాహిత్యంలో విశ్వనాథ వారి తరువాత ఎవరైనా.

'గిరి కుమారుని ప్రణయ గీతాలు' అయన తొలి కవిత. ఆ తరువాత ఆంధ్ర ప్రశస్తి , ఋతుసంహారం, రామాయణ కల్పవృక్షం వంటి కావ్యాలు రాసారు. కిన్నరసాని పాటలు, కోకిలమ్మ పెళ్లి, బానిసల దీవి, ఉయ్యాలతాళ్లు వంటి గేయ కావ్యాలు, ఏకవీర, వేయిపడగలు, చెలియలికట్ట, బద్దన్నసేనాని, సముద్రపుదిబ్బ, మ్రోయుతుమ్మెద వంటి నవలలు, నర్తనశాల, సాప్తిక ప్రళయం, అనార్కలి, వేనరాజు, త్రిశూలం, కళింగరాజ్యం వంటి నాటకాలు, శర్మిష్ఠ వంటి సంస్కృత నాటకాలు, ఎన్నో కథలు, పురాణపైర గ్రంథమాల పేరుతో ఎన్నో నవలలు...మొత్తం లక్ష పుటలకు పైగా సాహిత్యం అందించిన విశ్వనాథ సత్యనారాయణ గారు ' ర

స్వల్పకాలిక లక్ష్యం ...

నేటినిజం
మంగళవారం 22-10-2019

సంవత్సరం కాల వ్యవధిలో రిజర్వ్ బ్యాంకు వారు ఆరుసార్లు 'వడ్డీ' శాతాన్ని తగ్గించడం 'స్థూల జాతీయ ఉత్పత్తి' పెరుగుదల వేగం పెరగడానికి దోహదం చేస్తుందన్నది జరిగిపోతున్న ప్రచారం. బ్యాంకులలో శ్రమార్జిత ధనాన్ని నిక్షిప్తం చేసిన మధ్యతరగతి ఖాతాదారులు మాత్రం తమ రాబడి తగ్గిపోతున్నందుకు 'లబోదిబో'మని రుసరుసలాడుతుండడం సమాంతర విపరిణామం. 'కాల వ్యవధి హుండీ'– ఫిక్స్‌డ్ డిపాజిట్–లను బ్యాంకులలో జమచేసి బ్యాంకులు చెల్లించే వడ్డీపై ప్రధానంగా ఆధారపడి జీవనయాత్ర సాగిస్తున్న 'పరిష్వ పౌరులు'– సీనియర్ సిటిజెన్స్– మరింత 'మిక్కిలి'గా దుఃఖిస్తున్నారట. అరవై ఏళ్లు పైబడిన ఇలాంటి వరిష్ఠ 'బ్యాంకు ఖాతాదారులు' దేశంలో నాలుగు కోట్ల మందికి పైగా ఉన్నారట! కానీ స్థూల జాతీయ ఉత్పత్తి– గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్– జిడిపి–ని పెంచి పెంచి అంతర్జాతీయ కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపచేసుకోవడం ప్రభుత్వానికి ప్రధాన లక్ష్యమైంది. రిజర్వ్ బ్యాంక్ వారి అతి ప్రధాన కార్యక్రమమైపోయింది. 'వడ్డీ' శాతం తగ్గితే 'జిడిపి' పెరుగుదల గతి పరుగులు తీస్తుందన్నది వ్యవస్థీకృతమైన ఆర్థిక సిద్ధాంతం. అందువల్ల బ్యాంకుల నుంచి అప్పులు స్వీకరించి పెట్టుబడులు పెట్టి ఉత్పత్తులను పెంచే లక్షల మంది సౌకర్యార్థం 'వడ్డీలు' తగ్గవలసిందే! బ్యాంకులలో చిన్న మొత్తాలను పెద్ద మొత్తాలను జమచేస్తున్న కోట్ల మందికి అసౌకర్యం కలిగినప్పటికీ ప్రభుత్వం చింతించవలసిన పని లేదు! 'రిజర్వ్ బ్యాంకు'వారు వాణిజ్య బ్యాంకుల నుండి వసూలుచేసే వడ్డీ శాతం తగ్గిపోతోంది. అందువల్ల వాణిజ్య బ్యాంకులు తమవద్ద ఋణాలు తీసుకొనేవారికి మరింత తక్కువ వడ్డీకి అప్పులిస్తున్నాయి. ఫలితంగా బ్యాంకుల నుంచి భారీ మొత్తాలను ఋణాలుగా తీసుకుంటున్న వ్యాపారులు పారిశ్రామికులు ఉత్పత్తులను పెంచుతున్నారట! 'జిడిపి' పెరుగుతోంది. కానీ ఇలా 'వడ్డీ'లు తగ్గడం వల్ల నగదు చెలామణి పెరిగి, వస్తువులకు గిరాకీ పెరిగి, ధరలు– ద్రవ్యోల్బణం కూడ 'ఫరీ'గా పెరగడం సమాంతర పరిణామక్రమమన్నది చరిత్ర చెబుతున్న పాఠం. దీనివల్ల కోట్ల మంది వినియోగదారులు తాము కొనుగోలుచేసే నిత్యావసరాలకు ఎక్కువ ధరలను చెల్లించవలసి వస్తుంది. ఇలా కోట్ల మంది బ్యాంకులలో జమచేసిన వారికి లభించే వడ్డీ శాతం తగ్గుతోంది. మరిన్ని కోట్ల మంది వినియోగదారులు అధికంగా 'ధర'ను చెల్లించాలి! అయినా ఈ కోట్ల మందికి ప్రాధాన్యం లేదు. 'ఉత్పత్తి'ని పెంచి 'జిడిపి'ని పెంచగల లక్షల "పెట్టుబడిదారుల"కు తక్కువ వడ్డీలకు బ్యాంకుల నుంచి ఋణాలు లభించడం ప్రధానం. 'ప్రపంచీకరణ'ను వ్యవస్థీకరించిన మాజీ ప్రధాని, 'అంతర్జాతీయ ఆర్థికవేత్త' మన్‌మోహన్ సింగ్ నేర్పిన పాఠం ఇది. 'నేర్చుకున్న' ప్రస్తుత ప్రభుత్వం చిత్తశుద్ధితో 'అనుసరిస్తోంది..' రెండు కోట్ల కోట్లు రూపాయల మూడు ట్రిలియన్ అమెరికా డాలర్ల– స్థాయి మన 'జిడిపి'మూడున్నర కోట్లు కోట్ల రూపాయల ఐదు ట్రిలియన్ల డాలర్లు కు ఎదగడం మన స్వల్పకాలిక లక్ష్యం మరి!!

అకాల వర్షాలతో దెబ్బతిన్న వరి, పత్తి పంటలు

నీట మునిగిన పంటలతో రైతన్నల ఆందోళన

కరీంనగర్,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): అకాల వర్సాలు పత్తి,వరి రైతులను తీవ్రంగా దెబ్బతీసింది. శుక్ర, శనివారం కురిసిన వర్షంతో వరి మొత్తం నేలవాలింది. ఖరీఫ్ సీజన్‌లోతీవ్ర కష్టాలకోర్చి సాగు చేసిన రైతులు పంటనీటమునగడంతో లబోదిబోమంటున్నారు. మరో రెండు రోజుల్లో వరి కోసేందుకు ఏర్పాట్లు చేసుకున్న దశలో అకాల వర్షం దెబ్బతీసిందని రైతులు వాపోతున్నారు. గత నాలుగైదు రోజులగా జిల్లా వ్యాప్తంగా కురిసిన వానలు అన్నదాతకు గుండెకోతను మిగిల్చింది. ఈదురు గాలులతో కూడిన వర్సానికి వేలాది ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి ప్రకోపానికి అన్నదాత కుదేలవుతున్నాడు. ఆరుగాలం శ్రమించి సాగుచేసి పంట చేతికొచ్చేవేల నేలపాలు కావడంతో దిక్కుతోచరి స్థితిలో పడ్డారు. మూడేళ్లుగా వరుణుడు తమను పగబడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ఆరంభంలో వర్సాలు కురువక పంటల సాగు ఆలస్యమైంది. సీజన్ ముగింపుదశలో కురుస్తున్న అకాల వర్షాలతో చెరువులు, కుంటలన్ని నిండి జలకళను సంతరించుకున్నాయి. ఈ నెలలో తొమ్మిది రోజుల్లో రికార్డుస్థాయిలో అత్యధిక వర్షపాతం నమోదైంది. జిల్లాలోని రామడుగు, శంకరపట్నం, మానకొండూరు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా మిగిలిన 13 మండలాల్లో సాధారణం కన్నా అధికంగా వర్షపాతం నమోదు కావడం విశేషం. వర్సానికి జిల్లాలోని పలు ప్రాంతాల్లోని వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు నీటమునిగాయి. ప్రధానంగా శంకరపట్నం, ఇల్లందకుంట, వీణవంక మండలాల్లో కురిసిన భారీ వర్సానికి వరిపంటకు ఎక్కువగా నష్టం జరిగింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్సాలకు ఇప్పటికే 119 గ్రామాల్లో 6,298 రైతులకు చెందిన 4,627 హెక్టార్లలో వరి పంటకు నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. నష్టం ఇంకా పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. వర్సాలు దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతాయని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం పత్తి పంట కాయ దశకు రాగా, కొన్ని ఏరియాల్లో మొదటి సారి ఏరుతున్నారు. ఎకరాలకు కనీసం పది క్వింటాళు రావాల్సిన దిగుబడి పంట కీలక సమ యం లో అకాల వర్షాలతో నష్టం వాటిల్లి ఆశించిన మేరకు దిగుబడి రాకపోగా, పెట్టుబడి వచ్చే పరిస్థితులు లేవని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలతో ఆశించిన మేరకు దిగుబడి వచ్చే పరి స్థితి కనిపించడం లేదు. దెబ్బతిన్న పంటలను ఏవోలు, ఏఈవోలు గ్రామాలవారీగా సర్వే చేసి వివరాలను సేకరిస్తున్నారు.

మద్యం వ్యాపారంలోకి మహిళలు?

భారీగా వారి నుంచే దరఖాస్తులు

పూర్తయిన ఎంపిక ప్రక్రియ

మహబూబ్‌నగర్,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): నూతన మద్యం దుకాణాల కోసం టెండర్లు వేయడానికి మహిళ వ్యాపారులు సైతం ముందుకు వచ్చారు. లాటరీ పద్ధతిన కొత్త దుకాణాదారులను ఎంపిక చేసారు. నవంబర్ ఒకటో తేదీ నుంచి కొత్త మద్యం దుకాణాల్లో అమ్మకాలను చేపట్టనున్నారు. కొందరు వ్యక్తులు సెంటిమెంట్ కోసం భార్యలను, ఇతర కుటుంబ సభ్యులను టెండర్ వేయడానికి తీసుకు వస్తే.. మరికొందరు మహిళలు వారి పేర్లమీద టెండర్లు వేసారు. టెండర్ వేసిన సొమ్ము రూ.1 లక్ష నుంచి రూ. 2లక్షలకు పెంచి దుకాణం రాకుంటే వెనక్కి చెల్లించే పరిస్థితి లేకపోవడం దరఖాస్తులపై ప్రభావం చూపిందని అధికారులు భావిస్తున్నారు. చివరి రోజు మహబూబ్‌నగర్ జిల్లాలో భారీగా దరఖాస్తులు వచ్చాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యధికంగా డిమాండ్ ఉన్న దుకాణంగా మిడ్జిల్ రికార్డు సృష్టించింది. ఈసారి మిడ్జిల్‌లో ఉన్న దుకాణం కోసం 63 మంది టెండర్లు వేశారు. అదేవిధంగా బాలానగర్ ఒకటో దుకాణానికి 58, బాలానగర్ రెండో దుకాణానికి 53 దరఖాస్తులు వచ్చాయి. హన్వాడ దుకాణానికి 45టెండర్లు పడ్డాయి. తక్కువ టెండర్లు వచ్చిన దుకాణాలలో మక్తల్, నారాయణపేట, మహబూబ్‌నగర్‌లో ఐదు దుకాణాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో మద్యం విక్రయాలు ప్రభుత్వమే నిర్వహిస్తుండటంతో వ్యాపారుల దృష్టి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాపై పడింది. ఏపీ నుంచి కర్నూలు, గుంటూరు, కృష్ణ, చిత్తూరు, వైఎస్సార్ కడప జిల్లాల నుంచి పలువురు మహబూబ్‌నగర్, గద్వాల, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలో టెండర్లు వేశారు. జిల్లాలో వచ్చిన టెండర్లలో దాదాపు 80 నుంచి 100వరకు సీమాంధ్ర ప్రాంతానికి చెందిన వ్యాపారుల టెండర్లు ఉన్నట్లు సమాచారం. అయితే సీమాంధ్ర వ్యాపారులు అధికంగా జాతీయ రహదారి పరిసర ప్రాంతాల్లో ఉన్న మద్యం దుకాణాలకు మాత్రమే అధికంగా టెండర్లు వేశారు. మక్తల్, నారాయణపేట ఇతర రిమోట్ ఏరియాల్లో ఉన్న దుకాణాల జోలికి వెళ్లలేదు. అయితే భారీగా మద్యం అమ్మకాలు ఉన్న దుకాణాల వివరాలు సేకరించి రెండేళ్ల కాలంలో ఏ దుకాణం ఏస్థాయిలో అమ్మకాలు చేశారు.. ఏ స్థాయిలో లాభాలు వచ్చాయనే అంశాలను క్షుణ్ణంగా తెలుసుకుని టెండర్లు వేసినట్లు తెలుస్తోంది. ఇకపోతే ఈసారి ఎన్నికలు లేకపోగా ఫీజు కూడా రెండింతలు పెంచడం వల్ల వ్యాపారులు పెద్దగా ఆసక్తి చూపలేదని తెలుస్తోంది. కొత్త మద్యం పాలసీ ప్రకారం అన్ని లాభనష్టాలు బేరీజు వేసుకుని ఈసారి ఆశించిన లాభాలు రాకపోవచ్చని చాలా వరకు వ్యాపారులు టెండర్లు వేసేందుకు ముందుకు రాలేదు. గతంలో మహబూబ్‌నగర్‌లో అధిక పోటీ ఉంటే ఈసారి మాత్రం జడ్చర్ల పరిధిలో ఉన్న దుకాణాల కోసం తీవ్ర పోటీ కనిపించింది.

వివో దీపావళి ఆఫర్లు ప్రకటన

న్యూఢిల్లీ,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): స్మార్ట్‌ఫోన్ తయారీదారు వివో దీపావళి సందర్భంగా వినియోగదారులకు బంపర్ ఆఫర్‌ను ప్రకటించింది. కేవలం 101 రూపాయల డౌన్ పేమెంట్ మాత్రమే చెల్లించి వినియోగ దారులు నూతన వివో ఫోన్‌ను ఈఎంఐ విధానంలో కొనుగోలు చేయవచ్చు. కేవలం ఆఫ్‌లైన్ స్టోర్స్‌లో ఫోన్లను కొనే వారికి మాత్రమే ఈ నెల 31వ తేదీ వరకు ఈ ఆఫర్‌ను అందిస్తున్నారు. ఇక హెచ్‌డీబీ ÷నాన్స్‌తో వివో ఫోన్లను కొంటే 10 శాతం క్యాష్‌బ్యాక్ ఇస్తారు. అలాగే హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ క్రెడిట్ కార్డులతో 5 శాతం క్యాష్‌బ్యాక్ ఇస్తారు. నెలకు కేవలం రూ.926 ఈఎంఐతో వివో ఫోన్లను కొనవచ్చు. అలాగే పాత ఫోన్లను ఎక్స్‌ఛేంజ్ చేస్తే రూ.1,999 విలువైన బ్లూటూత్ హెడ్‌ఫోన్స్‌ను వివో వి17 ప్రొ, ఎస్1 ఫోన్ల కొనుగోలుపై పొందవచ్చు.

రాష్ట్రాలను దివాళా తీయిస్తున్న పాలకులు

హైదరాబాద్, అక్టోబర్ 21:ఎన్నికల్లో తాయిలాలు ప్రకటించడం, ఇష్టం వచ్చినట్లుగా హామీలు ఇవ్వడం అన్ని పార్టీలకు ఆనవాయితీగా మారింది. ప్రధానంగా ప్రాంతీయ పార్టీలు ఎన్నికలు ఏవైనా లెక్కకు మించి హామీలు ఇస్తున్నారు. ప్రజలు రక్తం ధారపోసి పన్నుల రూపంలో కడుతున్న డబ్బులును అధికారంలోకి రాగానే ఇష్టం వచ్చినట్లుగా పందేరం చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఇలా వివిధ పథకాల పేరుతో పంపకాల కార్యక్రమం సాగుతోంది. పాలనంటే ఇదే అన్న రీతిలో ఇక్కడ కెసార్, అక్కడ వైఎస్ జగన్‌లో డబ్బుల పంపిణీలో మునిగి తేలు తున్నారు. దీంతో అభివృద్ధి అన్నది కుంటుపడింది. ప్రజలకు ఉపాధి చూపే అనేకానేక కార్యక్రమాలు పడకేశాయి. జాతీయ పార్టీగా చెప్పుకుంటున్న బిజెపి కూడా ఇలాంటి హామీల్లో తీసిపోవడం లేదు. ప్రాంతీయ పార్టీల ప్రభావాన్ని తట్టుకోవడానికి జాతీయ పార్టీలు కూడా హామీల విషయంలో పోటీపడక తప్పని పరిస్థితి ఏర్పడుతోంది. ఇలా ఇష్టం వచ్చినట్లుగా హామీలు గుప్పించి బొక్కసాన్ని ఖాళీ చేస్తున్న తీరు భవిష్యత్‌లో దివాళాకు దారి చూపుతోంది. కులాల పేరుతో పంపకాలు చేస్తున్న తీరు మరీ దారుణం కా మరోటి కాదు. తెలంగాణలో అమలు చేసిన పథకాలను అటుఇటుగా ఇప్పుడు ఎపిలో సిఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్నారు. ఎపిలో ఆర్టీసీ విలీనం ఇప్పుడు తెలంగాణలో కూడా అమలుచేయాలని ఆర్టీసీ కార్మికులు కోరుతున్నారు. ఒకరిని మించి ఒకరు అన్నట్టుగా ప్రజాధనాన్ని సంక్షేమం పేరిట కేసీఆర్, జగన్మోహన్‌రెడ్డి పంచిపెట్టడం ఎంతవరకు సబబో మేధావులు,ప్రజలు ఆలోచన చేయాలి. ఇలాంటి పథకాలపై ప్రజల్లో విస్తృతంగా చర్చ సాగాలి. ఆర్థికంగా దివాలా తీసే చర్యలను ప్రజలే అడ్డుకోవాలి. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వేల కోట్ల రూపాయలతో వివిధ పథకాలను అమలు చేయడం మొదలు పెట్టి ఇప్పుడు ఖజానా నిండుకోవడంతో ఆర్థి మాంద్యం ప్రభావం అని అంటున్నారు. ఇలా ఇష్టం వచ్చినట్లుగా వివిద పథకాలు,పెన్షన్ల పేరుతో డబ్బులను వెదజల్లి ఇప్పుడు బొక్కసంలో చిల్లిగవ్వ లేకుండా చేసారు. చేసిన అప్పులు తీర్చడం మాట అటుంచి వడ్డీలకు కూడా డబ్బుఉల లేకుండా పోయింది. సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు గత నెల జీతం చెల్లించడానికి కూడా సంస్థ వద్ద డబ్బుల్లేవని చెప్పి దాఆపు 50 వేల కుటుంబాలను రోడ్డు పడేసిన తీరు దారుణం కాక మరోటి కాదు. ఆర్టీసీ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి ప్రభుత్వం వద్ద కూడా డబ్బులు లేవనీ అదనపు అడ్వొకేట్ జనరల్ శుక్రవారం హైకోర్టు ధర్మాసనం ముందు చేసిన వ్యాఖ్యలు చూస్తే ప్రభుత్వం ఎంతగా దిగజారిపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు ఆర్టీసీ కార్మికుల సమ్మె ముదిరి రాష్ట్ర బంద్‌కు దారితీయడంతో పాటు మరింత ముదరింది. ఈ సమ్మెకారణంగా మున్ముందు ఎటువంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో తెలియదు. రైతుబంధు పథకం అమలుకు అష్టకష్టాలు పడుతున్నారు. రైతులకు రుణమాఫీ వంటి పథకాలు అమలు చేయవలసి ఉంది. ఇదేకాకుండా మరెన్నో హామీలు అమలుకు ఎదురు చూస్తున్నాయి. తెలంగాణలో పరిస్థితి ఇలావుంటే.. రెవెన్యూ లోటుతో ఆవిర్భవించిన ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజాధనాన్ని వివిధ పథకాల పేరిట పంచిపెడుతూ పోతున్నారు. అప్పులు చేసి మరీ ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలను అమలుచేయడం మొదలైంది. ఎన్నికలకు ముందు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పది వేల కోట్ల రూపాయలను అప్పుగా తెచ్చి పసుపు–కుంకుమ పేరిట పంచి పెట్టారు. ఇప్పుడు ఐదు నెలలుగా కొత్త ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నవరత్నాల పేరిట ఖజానాకు సమకూరుతున్న సొమ్మునంతా పంచిపెడుతున్నారు. మౌలిక వసతుల కల్పన వంటి పెట్టుబడి వ్యయం చేయకుండా సంక్షేమం పేరిట బొక్కసాన్ని ఖాళీ చేస్తున్నారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధి కుంటుపడింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం కూడా తగ్గుముఖం పట్టింది. రైతు భరోసా పథకానికి అవసరమైన మొత్తంలో తొలి విడత కింద చెల్లించడానికై ఐదు వేల కోట్ల రూపాయలు వెచ్చించగా, అందులో దాదాపు సగం అప్పుగా తెచ్చారు. అమ్మ ఒడి, డ్వాక్రా మహిళలకు ఏటా పది వేల వంతున చెల్లించే పథకం అమలుకు వేచి చూస్తున్నాయి. వాటి కోసం మరో 15 వేల కోట్ల రూపాయల వరకు అవసరమవుతుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బొత్తిగా బాగా లేదని ముఖ్యమంత్రి సహా మంత్రులందరూ చెబుతూ కూడా పథకాల పేరిట వేల కోట్లను పంచిపెడు తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు కూడా సకాలంలో చెల్లించలేని పరిస్థితికి దారితీస్తుందని ఆర్థికవేత్తలుహెచ్చరిస్తున్నారు. అర్థంపర్థం లేని వరాల వల్ల రాష్ట్ర భవిష్యత్తు, తమ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆలోచించే స్థితిలో ప్రజలు లేరు. ఎందుకంటే ఉచితంగా వస్తే ఎవరు మాత్రం వద్దనుకుంటారు. నిజానికి ఇలాంటి పథకాలు అవసరమా అన్నది ఆలోచన చేయాలి. ఓట్ల కోసం ఇలాంటి పథకాలను పట్టుకుని వేలాడుతున్న తీరు సరికాదు. ప్రజలను సోమరులగా చేసి,పనీపాటా లేకుండా చేసే పథకాలతో రాష్ట్రాలను నిర్వీర్యం చేస్తున్న పాలకులనునిలదీయాలి. మేధావులు, విద్యార్థులు ఇలాంటి దగుల్బాజీ పథకాలను నిలదీయాలి. ప్రజాధనాన్ని పంచిపెట్టి ఓటు బ్యాంక్‌ను అభివృద్ధి చేసుకోవాలన్న కాంక్షతోనే ఇలా చేస్తున్నారు. అయితే పరిమితులు లేని సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పోతే రాష్ట్రం ఆ తరవాత దేశం కూడా దివాళా తీస్తుంది. ఇలాంటి పథకాలపై ఇసితో పాటు, కేంద్రం కూడా కన్నేయాలి. ఏఉచిత పథకాలకు స్వస్తి చెప్పాలి. అప్పుడే మనుగడ సాధ్యం అవుతుంది.

కొండపోచమ్మ దిశగా కాళేశ్వరం

త్వరలోనే మోటర్ పంపుల ద్వారా నీరు

కరీంనగర్,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): కాళేశ్వరం ఎత్తిపోతల పథకం అనుకున్న లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో అడుగులు వేస్తోంది. లింక్–1, 2ల్లో రెండు మోటర్ల ట్రయల్స్ ఈ నెలాఖరుకు పూర్తిచేయనుండటంతో ఇక లక్ష్మీ (మేడిగడ్డ) బరాజ్ నుంచి శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) జలాశయానికి చేరుకుంటాయి. రోజుకు ఒక టీఎంసీ వరకు నీటిని ఎత్తిపోశారు. రోజుకు రెండు టీఎంసీల నీటి తరలింపునకు అన్ని మోటర్లు సిద్ధం కావలసి ఉన్నది. ఈ నేపథ్యంలో నంది పంప్‌హౌస్‌లో 124.4 మెగావాట్ల సామర్థ్యంతో బిగించాల్సిన ఏడు మోటర్లలో ఆరు అందుబాటులోకి రాగా.. మరో మోటరు ఈ నెలాఖరుకు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు సన్నాహాలుచేస్తున్నారు. గాయత్రి పంప్‌హౌస్‌లో సైతం 139 మెగావాట్ల సామర్థ్యంతో నడిచే బాహుబలి మోటర్లు ఏడింటిలో ఆరు ఇప్పటికే నడుస్తున్నాయి. మరో మోటర్ ఏర్పాటు తరలించి.. అక్కడి నుంచి లిఫ్ట్ ద్వారా ఎస్సారెస్పీ వరదకాల్వలో పోస్తారు. తద్వారా జలాలు శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) జలాశయానికి చేరుకుంటాయి. రోజుకు ఒక టీఎంసీ వరకు నీటిని ఎత్తిపోశారు. రోజుకు రెండు టీఎంసీల నీటి తరలింపునకు అన్ని మోటర్లు సిద్ధం కావలసి ఉన్నది. ఈ నేపథ్యంలో నంది పంప్‌హౌస్‌లో 124.4 మెగావాట్ల సామర్థ్యంతో బిగించాల్సిన ఏడు మోటర్లలో ఆరు అందుబాటులోకి రాగా.. మరో మోటరు ఈ నెలాఖరుకు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు సన్నాహాలుచేస్తున్నారు. గాయత్రి పంప్‌హౌస్‌లో సైతం 139 మెగావాట్ల సామర్థ్యంతో నడిచే బాహుబలి మోటర్లు ఏడింటిలో ఆరు ఇప్పటికే నడుస్తున్నాయి. మరో మోటర్ ఏర్పాటు ఈ నెలాఖరుకు సిద్ధంచేస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. మరోవైపు ఎస్సారెస్పీ పునర్జీవ పథకంలో భాగంగా రోజుకు 0.65 టీఎంసీల నీటిని ఎత్తిపోయడానికి రెండు పంప్‌హౌస్‌లు సిద్ధమయ్యాయి. ఈ ఏడాది జూన్ 21న సీఎం కేసీఆర్ చేతులమీదుగా ప్రారంభమైన కాళేశ్వరం ప్రాజెక్టులోని లింక్ 1, 2 వ్యవస్థలు సిద్ధమవటం కీలక పరిణామం. ఒక్కో పంప్‌హౌస్‌లో అంచెలంచెలుగా మోటర్లు అమర్చుతూ, డ్రైరన్, వెట్‌న్ర్‌లను నిర్వహించి వినియోగంలోకి తెచ్చారు. ప్రస్తుతం లక్ష్మీ బరాజ్ ఫోర్‌షోర్‌నుంచి రోజుకు రెండు టీఎంసీలను ఎత్తిపోసేందుకుగాను లక్ష్మీ (కన్నెపల్లి) పంప్‌హౌస్‌లో 40 మెగావాట్ల సామర్థ్యంతో 11 మోటర్ల బిగింపు, ట్రయల్స్ పూర్తయింది.తర్వాతి దశలో సరస్వతి (అన్నారం) బరాజ్ ఫోర్‌షోర్‌నుంచి సరస్వతి (అన్నారం) పంప్‌హౌస్ ద్వారా నీళ్లు ఎత్తిపోసే వ్యవస్థ కూడా అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ 40 మెగావాట్ల సామర్థ్యంతో పనిచేసే 8 మోటర్లను బిగించారు. ఆ తర్వాత పార్వతి (సుందిల్ల) బరాజ్ నుంచి పార్వతి (సుందిల్ల) పంప్‌హౌస్ ద్వారా జలాల ఎత్తిపోత కోసం 40 మెగావాట్ల సామర్థ్యం ఉన్న 9 మోటర్లు కూడా అందు బాటులోకి వచ్చాయి. దీంతోపాటు శ్రీరాంసాగర్ పునర్జీవ పథకంలో భాగంగా రాంపూర్, రాజేశ్వర్‌రావుపేట పంపుహౌస్‌లలో కూడా రోజుకు 0.65 టీఎంసీల జలాల్ని ఎత్తిపోసేందుకు మోటర్లు సిద్ధంగా ఉన్నాయి. ఇవి పూర్తయితే కొండపోచమ్మ జలాశయానికి నీరు చేరనుంది.

మరింత ఉధృతంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె

ఆర్టీసీకి మద్దతుగా నిలిచిన అన్ని వర్గాలు

సిఎం కెసిఆర్ నిరంకుశ వైఖరిపై సర్వత్రా నిరసనలు

ఆదిలాబాద్,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ కార్మికుల సమస్యను పరష్కరించకుండా సిఎం కెసిఆర్ కావాలనే జాప్యం చేస్తున్నారని ఆర్టీసీ కార్మికవర్గాలతో పాటు, ప్రజలు,నాయకులు మండిపడ్డారు. పేద మధ్య తరగతి, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని డిస్మిస్ చేయాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. వరుసగా 17వరోజూ ఆర్టీసీ కార్మికుల ధర్నా కొనసాగింది. ఊరూవాడా కార్మికలకు మద్దతు లభించి ంది. ఆర్టీసీ కార్మికులు ఏర్పాటు చేసిన ధర్నా కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, తుడుం దెబ్బ, బీజేపీ, కాంగ్రెస్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఆర్టీసీలో ఏళుగా పనిచేస్తున్న కార్మికులను సీఎం సెల్ఫ్ డిస్మిస్ చేస్తామని ప్రకటించడం కెసిఆర్ దొరతనానికి నిదర్శన మన్నారు. సమ్మెపై గవర్నర్జోక్యం చేసుకోవాలన్నారు. హైకోర్టు ఆదేశానలు కూడా ఖాతరుచేయకుండా సిఎం కెసిరా÷– మొండిగా వ్యవహరించడం నిరంకుశానిక ఇపరాకాష్ట అన్నారు.

17 రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం లేదని వెంటనే ఈ ప్రభుత్వాన్ని డిస్మిస్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని పాలించే హక్కు టీఆర్ఎస్ ప్రభుత్వానికి లేదన్నారు.

టీఆర్ఎస్ ప్రభుత్వం హామీలు ఇచ్చి అమలు చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు

. సమ్మెకు అన్ని వర్గాల కార్మికులు మద్దతు తెలిపి ప్రభుత్వం మెడలు వంచి సమస్యలు పరిష్కరించు కోవాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ అప్పులకు ప్రభుత్వమే కారణమన్నారు.మరోవైపు ఆర్టీసీ కార్మికులు చేపడుతున్న సమ్మెకు రోజురోజుకు సబ్బండ వర్ణాల నుంచి మద్దతు లభిస్తోంది. ఇప్పటికే ఆయా రాజకీయ పార్టీలు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు మద్దతు ప్రకటించగా, తాజాగా ఉద్యోగ జేఏసీ నాయకులు కార్మికుల సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కళాకారుల ఆటాపాటలతో నిరనన కార్యక్రమాలు హోరెత్తుతున్నాయి. వంటావార్పు, ర్యాలీలు, మానవహారం, సీఎం దిష్టిబొమ్మ దహనం, తదితర కార్యక్రమాలతో జోరు పెంచారు. ఈ నెల 5న ప్రారంభమైన సమ్మె సోమవారం వారం నాటికి 17వ రోజుకు చేరుకుంది. రోజుకో విధంగా నిరసన కార్యక్రమాలుచేపడుతూ సమ్మెను ఉధృతం చేస్తున్నారు. కార్మికుల సమ్మెకు మద్దతుగా టీఎన్జీఓ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆదిలాబాద్ పట్టణంలోని పలు వీధుల గుండా మోటార్‌సైకిల్ ర్యాలీలు నిర్వహించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రభుత్వం ఆర్టీసీకి రూ.2600 కోట్ల బకాయి ఇవ్వాల్సి ఉందన్నారు. డీజిల్‌పై పన్ను విధించడంతో ఆర్టీసీపై భారం పడుతుందన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీకి రూ.50వేల కోట్ల ఆస్తులు ఉన్నాయని తెలిపారు. సమ్మె చేపడుతున్న కార్మికులను సెల్ఫ్ డిస్మిస్ పేరిట 48వేల మంది ఉద్యోగులను తొలగించామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఉద్యోగులను తొలగించే హక్కు ప్రభుత్వానికి లేదన్నారు. యూనియన్‌లు వద్దంటే పార్టీలు ఎందుకని ప్రశ్నించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు.

రోజురోజుకూ మరింత ఉధృతంగా ఆర్టీసీ సమ్మె

ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న మద్దతు

ఖమ్మం,అక్టోబర్21(ఆర్ఎన్ఎ):ఆర్టీసీ కార్మికుల పరిష్కరించాలని డిమాండ్ చేస్తుంటే ముఖ్యమంత్రి కెసిఆర్ మొండి వైఖరి అవలంబిస్తున్నారని కార్మికల నేతలు, ప్రజలా సంఘాలనేతలు అన్నారు. ఉమ్మడి జిల్లాలో సమ్మె ఉధృతం అవుతోంది. అన్ని ప్రజాసంఘాలు మద్దతు ఇస్తున్నాయి. హైకోర్టు గడువు ఇచ్చి ఆ లోగా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించినప్పటికి నేటి వరకు స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులు సమస్యలను పరిష్కరించాలని ఆందోళన చేస్తుంటే వారికి ప్రజలు, అఖిలపక్ష పార్టీలు పూర్తి మద్దతునిస్తే వారిపై పోలీసులచే దాడులు చేపిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నియంతృత్వ వైఖరి విడనాడి ఆర్టీసీ కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు రాయల చంద్రశేఖర్, సీపీఎం జిల్లా కార్

వాహనదారుల్లో కనిపిస్తున్న మార్పు

-జరిమానాలకు జంకడంతో ఉల్లంఘనలకు చెక్

హైదరాబాద్,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): భారీ జరిమానాల హెచ్చరికలతో వాహనదారుల్లో మార్పుకనిపిస్తోంది. కేసుల సంఖ్య గణనీయంగా తగ్గడం పోలీసులు కూడా ఊపిరి పీల్చుకుంటున్నారు. జరిమానాలు కట్టాల్సి వస్తుందన్న భయాలతో వాహనదారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వాహనదారుల్లో పెరిగిన అవగాహన తో రోడ్డు భద్రత పెరిగిందని పోలీసులు కూడా అంగీకరిస్తున్నారు. జరిమానా ఏ రూపంలో పొంచి ఉందో తెలియని అయోమయ పరిస్థితి ఉండడంతో ముందుగానే జాగ్రత్త పడుతున్నారు.గతంలో ఉన్న నిర్లక్ష్యం ఇప్పుడు వారిలో కనిపించడం లేదని ట్రాఫిక్ పోలీసులు అంటున్నారు.. గతంలో మాదిరిగా వాహనాలను ఆపి జరిమానా విధించడం లేదు.. మనం వెళ్తుంటే మనకు తెలియకుండా ఫొటో తీసి ఆన్‌లైన్‌లో జరిమానా చలాన్ పంపిస్తున్నారు.. దీనికి తోడు నూతన వాహనం చట్టం, ట్రాఫిక్ జరిమానాలపై వాట్సప్ గ్రూప్‌ల్లో భయపెట్టే విధంగా వైరల్ అయిన వీడియోలు... ఫలితంగా నిబంధనలకు విరుద్ధంగా వాహనంతో బయలుదేరాలంటేనే ఒకటికి, రెండు సార్లు ఆలోచించాల్సిన పరిస్థితి వచ్చింది. ట్రాఫిక్ నిబంధనలను కఠినతరం చేయడం, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడం, భయంతో కూడిన భక్తి వల్ల వచ్చిన మార్పుతో ట్రాఫిక్ కేసులు తగ్గుముఖం పడుతున్నాయి. చాలామంది ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుంటే బయటకు పోవడానికి భయపడుతున్నారు. అలాగే, ఎక్కడ వాహనం ఆపాలన్నా నో పార్కింగ్ బోర్డు ఉందా అని ఒకటికి, రెండు సార్లు ఆలోచిస్తున్నారు.. అలాగే, ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద కూడా చాలా జాగ్రత్త పడుతున్నారు.గ్రీన్ లైట్ పడిన తర్వాతే బండిని ముందుకు దూకిస్తున్నారు. ఇలాంటి చిన్నచిన్న జాగ్రత్తలతో వాహనదారులు జరిమానాల బాధ నుంచి తప్పుకుంటున్నారు. ఫలితంగా వాహనదారులకే కాకుండా ఎదుటి

వారు కూడా ప్రమాదాల బారి నుంచి బయటపడుతున్నారు. సిగ్నల్ జంప్, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణం, నో పార్కింగ్, రాంగు రూట్ ఇలా అనేక అంశాల్లో ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించి వాటిని నేరుగా ఇంటికే చలాన్ పంపిస్తున్నారు. దీంతో లబోదిబోమంటున్న వాహనదారులు.. తాము నిబంధనలను ఎక్కడ ఉల్లంఘించామో తెలియజేసేలా సమ యం, తేది, వాహనం ఫొటో జత చేస్తుండడంతో కిక్కురుమనలేని పరిస్థితి ఎదురవుతోంది. ఇక ట్రాఫిక్ అధికారులు వాహనాల తనిఖీ సమయంలో జరిమానా విధించే పెండింగ్ చలాన్లు ఉన్నాయా అని కూడా పరిశీలిస్తున్నారు. ఫలితంగా ఎప్పటిప్పుడు జరిమానా చెల్లించక తప్పడం లేదు. వీటన్నింటినీ అధిగమించేందుకు నిబంధనలు పాటించడమే మార్గమని భావిస్తుండడంతో కేసుల సంఖ్య తగ్గుతోందని గణాంకాలు చెబుతున్నాయి. మొత్తంగా మార్పు మంచిదన్న భావన కనిపిస్తోంది.

చట్టం ముందు అందరూ సమానమే..

■ప్రజల మన్నన పొందేలా పనిచేయండి

■ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి

- పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో పాల్గొన్న జగన్

విజయవాడ, అక్టోబర్21(ఆర్ఎన్ఎ) :ప్రజల మన్నన్నలు పొందేలా పోలీసులు తమ విధులు నిర్వర్తించాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరు ప్రవర్తించినా వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో జగన్ పాల్గొన్నారు. అమరవీరులకు నివాళులర్పించిన ఆయన పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం 'అమరులు వారు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. పోలీసుల సేవలను కొనియాడారు. విధి నిర్వహణలో ఎంతోమంది పోలీసులు అమరులయ్యారని అన్నారు. సాధారణ ప్రజల గౌరవం, మన్ననలు పొందేలా పోలీసులు పని చేయాలని సీఎం పిలుపునిచ్చారు. చైనా సైన్యంతో వీరోచితంగా పోరాడి వీరమరణం పొందిన సైన్యాధికారి కరణ్‌సింగ్ సహా పదిమంది సీఆర్పీఎఫ్ సిబ్బంది త్యాగాన్ని గుర్తుచేసుకుంటూ పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకొంటున్నామని అన్నారు. అలాంటి అమరవీరులు అందరికి ఈ సందర్భంగా సెల్యూట్ చేస్తున్నా అన్నారు. మెరుగైన వ్యవస్థ కోసం ప్రతీ పోలీస్ నిరంతరం కృషి చేయాలని సీఎం జగన్ పేర్కొన్నారు. పోలీస్ టోపీ మీద ఉన్న మూడు సింహాలు దేశ సార్వభౌమాధికారానికి నిదర్శనమని, శాంతి భద్రతల విషయంలో ఎంతటివారికైనా మినహాయింపు ఉండకూడదని అన్నారు. బలహీన వర్గాలకు అన్యాయం జరిగితే ఎంతవారినైనా చట్టం ముందు నిలబెట్టాలని ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి సమావేశంలోనే చెప్పిన విషయాన్ని జగన్ గుర్తుచేశారు. చట్టం అందరికి సమానమేనని అన్నారు. పోలీసులు సెలవులు లేకుండా కష్టపడుతున్నారని.. అందుకే దేశంలో తొలిసారిగా వారికి వారాంతపు సెలవు ప్రకటించామన్నారు. వారంలో ఒకరోజు పోలీసులు తమ కుటుంబాలతో గడిపితే మానసికంగా బలంగా ఉంటారన్నారు. అవినీతి, రౌడీయిజంపై నిజాయితీగా యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హోంగార్డుల వేతనాలను రూ. 18 వేల నుంచి రూ. 21 వేలకు పెంచామని, హోంగార్డులు మరణిస్తే రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన తొలి రాష్ట్రం కూడా మనదేనని అన్నారు. విధి నిర్వహణలో మరణించిన పోలీసులకు రూ.40 లక్షల వరకు బీమా సదుపాయాన్ని తీసుకొచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో డీజీపీ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఉప ఎన్నిక తరవాత కాంగ్రెస్‌లో సిగపట్లు తప్పవ్

పిసిసి పీఠం కోసం రేవంత్, కోమటిరెడ్డిల మధ్య ఫైట్

ఎన్నికల్లో గెలుపు టిఆర్ఎస్‌దే అన్న పల్లా

నల్లగొండ,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ గడప గడపకు తిరిగి ఓట్లడిగామని టీఆర్ఎస్ హుజూర్‌నగర్ ఉప ఎన్నికల ఇంచార్జి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉప ఎన్నిక అయి పోగానే ఉత్తమ్ పీసీసీ పోస్ట్ ఊడిపోతుందని ఆయన జోస్యం చెప్పారు. రేవంత్, కోమటిరెడ్డి పీసీసీ పదవి కోసం రోడ్ల మీద పడి కొట్టుకుంటారని ఎద్దేవా చేశారు.

హుజూర్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం రాజేశ్వర్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డి హుజూర్‌నగర్ ప్రజలను రెచ్చగొట్టేలా, అవమానించేలా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికుడైన సైదిరెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించాలని హుజూర్‌నగర్ ప్రజలంతా మనసారా కోరుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీ బండ ప్రకాశ్, ప్రభుత్వ విప్ బోడకంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్, హుజూర్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి సైదిరెడ్డి పాల్గొన్నారు. ఇది టీఆర్ఎస్ అభివృద్ధికి అభివృద్ధి నిరోధక ఉత్తమ్ కుటుంబానికి వచ్చిన ఉప ఎన్నిక. ఒక్క అవకాశం ఇవ్వండి. అభివృద్ధి అంటే ఎంటో చేసి చూపిస్తా. ప్రజలంతా గమనిస్తున్నరు. ఉత్తమ్ అహంకారానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నరు. పద్మావతి రెడ్డికి ఘోర పరాజయం తప్పదు. హుజూర్‌నగర్ అభివృద్ధి కోసమే ఈ ఎన్నిక వచ్చింది. టీఆర్ఎస్‌కు పట్టం కట్టేందుకు హుజూర్‌నగర్ ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని పల్లా అన్నారు. ఓటమి భయంతో ఉత్తమ్ కాంగ్రెస్ లీడర్లందరినీ ఇక్కడకు రప్పించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిండు. నాపై ఉత్తమ్ చేసిన ఆరోపణలు నిరూపించాలి. లేదంటే ఉత్తమ్ భేషరతుగా క్షమాపణలు చెప్పి ముక్కు నేలకు రాయాలని టీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సైదిరెడ్డి డిమాండ్ చేశారు. హుజూర్‌నగర్ అభివృద్ధిపైనే తమ దృష్టి అని సైదిరెడ్డి అన్నారు. పండుగలకు, పెళ్లిళ్లకు తప్ప ఉత్తమ్ ఏనాడూ హుజూర్‌నగర్‌కు రాలేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని ఉత్తమ్ పట్టించుకోలేదన్నారు. జన్మభూమికి ఏదైనా చేయాలనే ఉద్దేశంతోనే ఇక్కడ పనిచేస్తున్నట్లు తెలిపారు. గతంలో తాను ఓడిపోయినా ప్రజల్లో ఉండి పనిచేస్తున్న విషయాన్ని గమనించాలన్నారు. ఈ ఎన్నిక హుజూర్‌నగర్ అభివృద్ధికి అదృష్టం కొద్ది వచ్చిన ఎన్నికని ఆయన పేర్కొన్నారు.

పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ

-పెద్దపల్లిలో హరితహారంలో పోలీస్ కమిషనర్ సత్యానారాయణ

పెద్దపల్లి,అక్టోబర్ 21(ఆర్ఎన్ఎ): పర్యావరణ పరిరక్షణ కోసం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో హరితహారం నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనర్ సత్యనారాయణ, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ.. రోజు రోజుకూ కలుషితమవుతున్న పర్యావరణాన్ని మొక్కల పెంపకంతోనే కాపాడుకోవచ్చని ఆయన అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ స్ఫూర్తితో దేశంలోని చాలా రాష్ట్రాలు హరిత హారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. పెద్దపల్లి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో అనేక కార్యక్రమాలు విజయవంతమ య్యాయనీ.. అందులో హరితహారం పర్యావరణానికి మేలు చేకూర్చే విశిష్ట కార్యక్రమమని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ.. విధిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగం కావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ హౌజింగ్ కార్పోరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, పెద్దపల్లి డీసీపీ సుదర్శన్ గౌడ్, సీఐ ప్రదీప్‌కుమార్, ఎస్ఐ ఉపేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తగూడ బొటానికల్ గార్డెన్‌రు ఐఎస్‌వో సర్టిఫికెట్

హైదరాబాద్,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): రాజధాని నగరంలోని కొత్తగూడ బొటానికల్ గార్డెన్‌కు ఐఎస్ఓ సర్టిఫికెట్ లభించింది. కార్యక్రమంలో అటవీ పర్యావరణశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతల మీదుగా ఎఫ్‌డీసీ అధికారులు ఐఎస్ఓ సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఐటి కారిడార్‌లో అర్బన్‌లంగ్‌స్పేస్ కోసం ఎకో టూరిజం పేరుతో అభివృద్ధి కార్యక్రమాలకుగాను బొటానికల్ గార్డెన్‌కు ఐఎస్ఓ సర్టిఫికెట్ దక్కింది. ఈసందర్భంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అర్బన్ ఫారెస్ట్రీ పార్కులకు అంతర్జాతీయ గుర్తింపు రావడం గొప్పవిషయమని అన్నారు. ఒక పార్కుకు దేశంలోనే ఐఎస్ఓ సర్టిఫికెట్ రావడం ఇదే మొదటిసారి అన్నారు. బొటానికల్ గార్డెన్‌కు ఈ అరుదైన గౌరవం దక్కడం సంతోషమని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అటవీశాఖ అర్బన్ ఫారెస్ట్రీ పార్కులను తీర్చిదిద్దుతున్నదని తెలిపారు.

కులమాతాల మధ్య బిజెపి చిచ్చు

దేశ అర్థిక పరిస్థితి అస్తవ్యస్థం

హర్యానా ప్రచారంలో రాహుల్ విమర్శలు

చండీఘడ్,అక్టోబర్21 (ఆంఎన్ఎ): గబ్బర్ సింగ్ ట్యాక్స్' (జీఎస్‌టీ)తో చిన్న, మధ్యతరహా వ్యాపారాలు ధ్వంసమయ్యాయని కాంగ్రెస్ ఎంపి రాహుల్ అన్నారు. ప్రపంచానికి ప్రేమ, ప్రగతి మార్గాన్ని చూపించిన భారతదేశం ఇవాళ కులాలు, మతాల మధ్య పోరుగా మారుతుండటం చూసి ప్రపంచదేశాలు పరిహసిస్తున్నాయని, దేశ ప్రతిష్ట, ఆర్థిక వ్యవస్థను మోదీ ధ్వంసం చేశారని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీకి ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి అవగాహన లేదని, ఆయన ప్రభుత్వ విభజన రాజకీయాలు, ఒకరిపై మరొకరిని ఉసిగొలిపే చర్యలకు భారతదేశాన్ని చూసి ప్రపంచ దేశాలు పరిహసిస్తున్నాయని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నిప్పులు చెరిగారు. హర్యానా ఎన్నికల ప్రచారంలో భాగంగా వివిధ ప్రాంతాల్లో ప్రసంగించారు. దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల నుంచి ప్రజల దృష్టిని నిరంతరం మళ్లించే ప్రయత్నాలు మోదీ చేస్తున్నారని అన్నారు. నిజం నిర్భీతిగా చెప్పేందుకు మీడియా సైతం భయపడు తోందన్నారు. నిజం తమకు తెలిసినప్పటికీ తాము నిర్భీతిగా చెప్పలేకపోతున్నామని, ఉద్యోగాలు కోల్పోతామనే భయమే అందుకు కారణమని కొందరు మీడియా వ్యక్తులు చెబుతున్నట్టు ఆయన తెలిపారు.

ఎంఎన్ఆర్ఈజీఏను విమర్శించిన మోదీకి ఆర్థిక వ్యవస్థపై ఏమాత్రం అవగాహన లేదని రాహుల్ తప్పుపట్టారు. బిజెపి వాళ్లు ఎక్కడికి వెళ్లినా, ప్రజలు పోట్లాడుకునేలా చేస్తారు, హిందువులు-ముస్లింలు కావచ్చు, జాట్‌లు-జాట్‌యేతరులు కావచ్చు. ..ఒకరితో ఒకరికి పడకుండా చేస్తారు. సరైన విజన్ లేకుండా దేశాభివృద్ధి సాధ్యం కాదు' అని రాహుల్ పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఇక్కడకు వచ్చి ప్రచారం చేయాల్సి ఉందని, అయితే వైరల్ ఫీవర్ కారణంగా ఆమె రాలేకపోయారని రాహుల్ తెలిపారు. తన తరపున ప్రజలను కలుసుకుని, మాట్లాడాలిందిగా సోనియాగాంధీ కోరినట్టు ఆయన తెలియజేశారు.

పాన్ గుట్కాలపై ఉత్తరాఖండ్ నిషేధం

ఏడాదిపాటు నిషేధాజ్ఞలు అమలు

డెహ్రాడూన్,అక్టోబర్21 (ఆర్ఎన్ఎ): పాన్ మసాలాలు, గుట్కాల వాడకం, నిల్వచేయడం, పంపిణీ, తయారీ, అమ్మకాలపై ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఏడాది పాటు నిషేధం విధించింది. ఆహార భద్రతా కమిషనర్ నితీష్ కుమార్ ఝా ఈ ఆదేశాలను జారీ చేశారు. తక్షణం ఈ నిషేధం అమల్లోకి వచ్చింది. టుబాకో నమలడం, నికోటిన్ ఆధారిత ఉత్పత్తుల వాడకం వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతుండటాన్ని గుర్తించిన త్రివేంద్ర సింగ్ రావత్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. 2006 ఆహార భద్రతా ప్రమాణాల చట్టం ప్రకారం, ప్రజాప్రయోజనాల రీత్యా ఏడాది పాటు ఏ ఆహార ఉత్పత్తులపైనైనా నిషేధం విధించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుంది. ప్రజా వినియోగానికి సంబంధించిన ఉత్పత్తుల్లో నికోటిన్, టుబాకో ఉత్పత్తుల వాడకాన్ని భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ నిషేధించిన విషయాన్ని ఉత్తరాఖండ్ ప్రభుత్వం తమ ఉత్తర్వుల్లో ప్రస్తావించింది. రాష్ట్రంలో వివిధ పేర్లతో అమ్మకాలు జరుపుతున్న పాన్ మసాలా, గుట్కాలలో హెచ్చు మాతాదులో టుబాకో, నికోటిన్ ఉండటాన్ని కనుగొన్నందున ఏడాది పాటు నిషేధం అమలు చేస్తున్నట్టు ప్రభుత్వ ఉత్తర్వు తెలిపింది.

కొరివితో తల గోక్కోవడమంటే ఇదే!

హైదరాబాద్, అక్టోబర్ 21:కొరివితో తల గోక్కోవడమంటే తెలంగాణ సిఎంకెసిఆర్‌కు సరదాగా ఉన్నట్లుగా ఉంది. ఆర్టీసీ సమ్మెపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కూడా పట్టించుకునేలా కనిపించడం లేదు. తక్షణం చర్చలు జరపాలని హైకోర్టు శుక్రవారం ప్రభుత్వానికి సూచించింది. అయితే ప్రభుత్వంలో శనివారం వరకు ఎలాంటి కదలిక కానరాలేదు. ఆర్టీసీ కార్మికుల సమ్మె 15వ రోజుకు చేరుకుంది. ఆర్టీసీ కార్మిక సంఘాలు తెలంగాణ రాష్ట్ర బంద్‌కు పిలుపునివ్వడంతో రాష్ట్రవ్యాప్తంగా ఊరూవాడా ప్రజలు బంద్‌కు మద్దతుగా రోడ్డెక్కారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత తెలంగాణ ఏర్పాటు కోసం పనిచేసిన నేతకు వ్యతిరేకంగా బంద్ చేపట్టడం,అది పెద్ద ఎత్తున విజయవంతం కావడం ఇక్కడ గమనార్హం. కెసిఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ ఐదేళ్లలో ఇంతటి వ్యతిరేకత ఏర్పడడం బహుశా ఇదే ప్రథమం కవచ్చు.విపక్షాలు తమ విభేదాలు వీడి ఉమ్మడిగా బంద్‌కు మద్దతు పలికారు. పక్షం రోజులుగా ప్రయాణికులు కష్టపడుతున్నా ప్రభుత్వంలో చలనం లేకపోగా హైకోర్టు ఆదేశాలను కూడా ఖాతరు చేయకుండా పోతోంది. సిఎం కేసీఆర్ ఆర్టీసీ కార్మికులను చర్చలకు పిలిచే అవకాశం కానరావడం లేదు. కేసీఆర్ కోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకొని చర్చలు జరుపడానికి ముందుకు రాకపోవడం చూస్తుంటే కోర్టును కూడా లెక్కచేయరా అన్న ఆందోళన కలుగుతోంది. ప్రభుత్వం తరపు నుండి చర్చలు ఎవరు జరుపుతారు? అనే ప్రశ్నలకు సమాధానాలు దొరకటం లేదు. హైకోర్టు చర్చలు జరపాల్సిందేనని స్పష్టం చేయటంతో ప్రభుత్వం చర్చల దిశగా అడుగులు వేస్తున్న దాఖలాలు మాత్రం కానరావడం లేదు. హైకోర్టు ఆదేశాల మేరకు చర్చలు సాగాలని విపక్ష పార్టీలు గట్టిగా కోరుతున్నా ఆ దిశగా అడుగులు పడలేదు. అలాగేఆర్టీసీ కార్మిక సంఘాలు చర్చలకు సిద్ధమని గతంలోనే ప్రకటించాయి. ఆర్టీసీ జేఏసీ నాయకులు ప్రభుత్వం పిలిస్తే చర్చలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. తాజాగా హైకోర్టు ఆదేశాల మేరకు చర్చలకు సిద్ధమని, ఎవరు చర్చలకు పిలిచినా వెళతామని జెసి కన్వీనర్ అశ్వత్తామ రెడ్డి ప్రకటించారు. ప్రభుత్వం, ఆర్టీసీ కార్మికుల మధ్య చర్చలు జరిగితే కనీసం కార్మిక సంఘాలు పెట్టిన డిమాండ్లలో వేటిని అమలు చేయాలి..వేటిని పెండింగ్‌లో పెట్టవచ్చన్న అవకాశం ఉంది.మరోవైపు కార్మిక సంఘాలు, ప్రభుత్వం మధ్య చర్చలు జరిగినా చర్చల వలన పెద్దగా ఫలితం ఉండదనే టాక్ కూడా వినిపిస్తోంది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడా అనే ఉత్కంఠ నెలకొంది. సీఎం కేసీఆర్ హైకోర్టు ఆదేశాలు పాటిస్తారా? లేదా? అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు పరిష్కారం లభించటం అంత తేలిక కాదని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే సిఎం కెసిఆర్ తాడోపేడో తేల్చుకుందామన్న ధోరణిలో ఉన్నట్లుగాఉంది. హైకోర్టు ఆదేశాలపై ఆయన ఎలాంటి స్పందనా వ్యక్తం చేయలేదు. పాఠశాలలు, కళాశాలలకు సెలవులు పూర్తవుతూ ఉండటంతో ప్రభుత్వం ఉపయోగిస్తున్న స్కూల్, కాలేజీ బస్సులు వెనక్కు ఇచ్చేయాల్సి ఉంది. ఇప్పటికే సమ్మె మొదలై రెండు వారాలు పూర్తి కావటంతో ప్రజలు సమ్మె వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బంద్ నేపథ్యంలో చాలా ప్రాంతాలలో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ఇలాంటి పరిస్థితులలో సీఎం కేసీఆర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడో అన్న ఉత్కంఠ కనిపిస్తోంది. అయితే ప్రజా తెలంగాణలో ఇంతగా నిర్లక్ష్యం,నిరంకుశంగా వ్యవహరించడం మంచిది కాదన్న ధోరణి ఉంది. ఇది మంచి ధోరణి కాదని సిఎం కెసిఆర్ గుర్తిస్తే మంచింది. ప్రజలు ఆయన వెన్నంటి నడిచిన నేలలో ఇలా నిరంకుశంగా సాగడం ప్రజాస్వామ్యంలో మంచిది కాదు. ఆత్మహత్యలు చేసుకుని ఉద్యమం ద్వారా ప్రత్యేక తెలంగాణ సాధించుకున్నది మళ్లీ ఆత్మహత్యలు చేసుకునే దిశగా సాగడం మంచిదా అన్నది ఆలోచనచేయాలి. అవి అసలు సమస్యకు పరిష్కారం కాదు. ఈ విషయాన్ని తెలంగాణ ఉద్యమ సందర్భంలో కూడా కెసిఆర్ పదేపదే చెప్పడం జరిగింది. అయినప్పటికీ బలిదానాలు ఆగలేదు. సకల జనుల, సబ్బండ వర్ణాల పోరాటం మూలంగా తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది. స్వరాష్ట్రంలో బలిదానాలు ఉండవని ఆశించాము. దురదృష్టవశాత్తు ఇవ్వాళ ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్న తీరు ప్రతి ఒక్కరినీ కంటతడిపెట్టించింది. ఇవాళ సమస్యలకోసం ఆర్టీసీ ఉద్యోగులతో పాటు ప్రజలు ముందుకు వచ్చారంటే దీనికి తెలంగాణ ఉద్యమం నుంచి వచ్చిన స్ఫూర్తిగానే గుర్తించాలి. సమస్యలకు ముగింపు పలకాలంటే ముందుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను చర్చలకు పిలవాలి. వారితో చర్చించే ప్రసక్తే లేదన్న ధోరణి వల్ల సమస్య మరింత జటిలం కావడమే కాకుండా పరిష్కార ద్వారాలు మూసుకుపోయే ప్రమాదముంది. హైకోర్టు సూచనలు కూడా గౌరవించక పోవడం అన్నది కోర్టు ధిక్కరణ చర్యగా చూడాలి. ప్రభుత్వం ఎలాంటి పట్టింపులకు పోకుండా యాభైవేల మంది ఆర్టీసీ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి. మొదట సమ్మె విరమింప జేసేందుకు కృషి జరగాలి. సమ్మె విరమిస్తే గానీ ఆత్మహత్యలు ఆగవు. అంతే గాకుండా అనుభవం లేని డ్రైవర్లు బస్సులు నడపడం మూలంగా రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తెలంగాణ ఉద్యమ సందర్భంలో విద్యా సంస్థల బంద్‌వల్ల జరిగిన నష్టం అంతా ఇంతా కాదు. ఇప్పుడు కూడా విద్యాసంస్థల బంద్ వల్ల భావి తెలంగాణ భారీగా నష్టపోనున్నది. సమస్యలు తీవ్రం కాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది. ఇక్కడ అహంభావాలకుతావులేదు. వారంతా తెలంగాణ ముద్దుబిడ్డలే అని గ్రహించాలి. తెలంగాణ ఏర్పాటులో వారు కీలకంగా పోరాడారు. అలాంటి తెలంగాణలో వారు ఆత్మహత్యలకు పాల్పడినారంటే అది తప్పకుండా ప్రభుత్వ మొడి వైఖరిగానే చూడాలి. అలాంటి వాతావరణం రాకుండా చూడాల్సిన బాధ్యత కెసిఆర్‌దే. అందుకు ఆయన తన మొడి వైఖరిని వీడితే మంచిది. తెలంగాణలో ఓ మంచి వాతావరణం, అభివృద్ధి కొనసాగాలని అంతా కోరుకుంటున్నారు.

పోలీసుల త్యాగాల ఫలితంగానే శాతియుత వాతావరణం

-రాష్ట్ర బిసి సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్, అక్టోబర్ 21 (నేటినిజం ప్రతినిధి): రేయింబవళ్ళు శ్రమిస్తూ పోలీసులు సమాజానికి అందిస్తున్న సేవలు అమూల్యమైనవని రాష్ట్ర బిసి సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. పోలీసుల త్యాగాల ఫలితంగానే నేడు సమాజంలో శాంతియుత వాతావరణం నెలకున్నదని పేర్కొన్నారు.

పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం నాడు కమీషనరేట్ కేంద్రంలో జరిగిన స్మృతి పరేడ్ కార్యక్రమానికి రాష్ట్ర బిసి సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతూ ప్రజల ధన,మాన,ప్రాణాల రక్షణ కోసం పోలీసులు కుటుంబాలను శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. తీవ్రవాద, ఉగ్రవాద, మతోన్మాద శక్తులతో పోరాడుతూ శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని, అన్ని వర్గాల ప్రజలు తమవంతు సహకారం అందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గత సంవత్సరకాలంలో దేశవ్యాప్తంగా వివిధ స్థాయిలకు చెందిన 292 మంది పోలీసులు ప్రాణత్యాగం చేశారని చెప్పారు.

స్మృతి పరేడ్ సందర్భంగా పోలీసులు శోకశస్త్ర ద్వారా నివాళులర్పించారు.

సైతం వదలి ఉంటూ విధినిర్వాహణను కొనసాగిస్తున్నారని, వారికి సహకారం అందించాల్సిన బాధ్యత సమాజంలోని అన్ని వర్గాల ప్రజలపై ఉందన్నారు. శాంతిభద్రతలు అదుపులో ఉండేనే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కరీంనగర్ కమీషనరేట్‌లో పోలీసులు శాంతిభద్రత పరిరక్షణ కోసం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను అభినందించారు. సిసి కెమెరాల ఏర్పాటుతో నేరాలు నియంత్రణలోకి వచ్చాయని తెలిపారు. లేక్‌పోలీస్ ఏర్పాటుతో మానేరుడ్యాం పరిసరప్రాంతాల్లో అసాంఘీక కార్యక్రమాలు సద్దుమణిగి, భద్రతభావం ఏర్పడిందని చెప్పారు. జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివన్నారు. పెండింగ్‌లో ఉన్న అమరవీరుల ఇళ్ళస్థలాల సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

కరీంనగర్ పోలీస్ అడిషనల్ డిసిపి(ఎల్అండ్ఓ) ఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాలు వృధా పోవని వారి ఆశయాల సాధన కోసం పరేడ్ కమాండర్‌గా ఆర్ఐ మల్లేశం వ్యవహరించారు. ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా ఉగ్రవాద, తీవ్రవాద చర్యల్లో ప్రాణాలు కోల్పోయిన వివిధ రక్షణ/పోలీసు బలగాలకు చెందిన పోలీసుల పేర్లను అడిషనల్ డిసిపి(పరిపాలన) పి రవీందర్ చదివి వినిపించి నివాళులర్పించారు.

ఆర్టీసీ సమ్మెపై నిర్లక్ష్యం తగదు

–తక్షణమే సమ్మె పరిష్కరించాలి: రఘునందన్

సిద్దిపేట,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ కార్మికుల సమ్మె పదిహేడో రోజుకు చేరుకుంది. అటు ప్రభుత్వం, ఇటు కార్మికులు పట్టు వీడడం లేదు. దీంతో పరిష్కారం కనుచూపు మేరలో కనిపించడం లేదు. ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రఘునందరావు సంఘీభావం తెలిపారు. ఆర్టీసీ కార్మికులపై జరిగిన దాడులకు కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎప్పుడు చూడని తుగ్లక్ పాలన ఇప్పుడు చూస్తున్నామని అన్నారు. తెలంగాణలో కుటుంబ పాలన సాగుతుందని.. కేసీఆర్ నియంతలా మారి నిరంకుశ పాలన చేపడుతున్నారన్నారు. రాష్ట్రంలో హక్కుల గురించి అడిగే హక్కు ఏ సంఘాలకు లేకుండా కేసీఆర్ చేశారన్నారు. కేసీఆర్ తన స్వగ్రామం చింతమడకలో ప్రతి కుటుంబానికి రూ. 10 లక్షలు ఇచ్చి ఈ ప్రాంత ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు.

ఎంఐఎంతో కలిసి కేసీఆర్ నిజాం పాలన చేస్తున్నారని, 50 వేల ఆర్టీసీ ఉద్యోగులను తొలిగించిన ఘనత కేసీఆర్‌కే చెల్లిందన్నారు. ఉద్యోగ నియామకాలు లేవని.. ఉన్న ఉద్యోగాలను కేసీఆర్ తొలగిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల హామీలో భాగంగా కేసీఆర్ ఇస్తానన్న.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రైతు రుణమాఫీ ఎక్కడా అని ప్రశ్నించారు. మహిళ సంఘాలకు పావలా వడ్డీ రుణాలు, నిరుద్యోగులకు ఇస్తానన్న నిరుద్యోగ భృతి ఇవ్వట్లేదని కేసీఆర్ తీరును ఎండగట్టారు. కేసీఆర్ కళ్లున్న కబోదిలా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో ధృతరాష్ట్రుని పాలనసాగుతోందన్నారు. నాటి ధృతరాష్ట్రుడి పాలనలో ద్రౌపతికి జరిగిన అన్యాయం నేడు తెలంగాణలో మహిళా ఆర్టీసీ కార్మికులకు జరిగింది. మహిళల హక్కులను కాలరాసే విధంగా, దురుసుగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఉద్యోగ సంఘాల నాయకుడిగా చెలామణి అయిన శ్రీనివాస్ గౌడ్ నేడు మంత్రి పదవి రాగానే.. ఉద్యోగ సంఘాలను ఆర్టీసీ సంఘాలకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి ఇంటికి తీసుకెళ్లి భోజనం పెట్టించి కార్మిక సంఘాలలో చీలిక తేవడానికి ప్రయత్నిస్తున్నాడన్నారు. మీ మంత్రి పదవుల కోసం కార్మిక సంఘాల భవిష్యత్తును నాశనం చేయకండి. ఉద్యోగ, కార్మిక సంఘాలు ఐక్యంగా ఉంటూ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. మీ పోరాటానికి భారతీయ జనతా పార్టీ పక్షాన మేము కార్మిక, ఉద్యోగ సంఘాలకు ఎల్లప్పుడూ సహకరిస్తామని అన్నారు.

తెలంగాణలో నియంత పాలన

అక్రమాలపై సిబిఐ విచారణ జరపాలి: పొన్నాల

జనగామ,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ చర్యలతో ఆర్టీసీ కార్మికులు అధైర్య పడొద్దని అండగా ఉంటామని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య అన్నారు. జిల్లా కేంద్రం లో ఆర్టీసీ కార్మికులు చేస్తున్న రిలే నిరవధిక దీక్షలకు మద్దతు పలికారు. ఆర్టీసీకి సంబంధించి సుమారు రూ. 60 వేల కోట్ల ఆస్తులను ఏళ్ల పాటు తన అనుయాయులకు లీజుకు కట్టబెట్టేందుకు కేసీఆర్ కట్రలో భాగంగానే సమ్మె చేస్తున్న కార్మికులను అడ్డదారిలో తొలగిస్తున్నాడన్నారు.రాష్ట్రంలో జరుగుతున్న మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, విద్యుత్ కొనుగోళ్లు, కాళేశ్వరం, రంగారెడ్డి పాలమూరు ప్రాజెక్టుల్లో జరుగుతున్న అనేక అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం సీబీఐ ఎంక్వైరీ చేయించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి వారి సమస్యలను పరిష్కరించకుంటే పోరును మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 48 వేల ఆర్టీసీ కుటుంబాలను జారున పడేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం కుట్రలు పన్నుతుందన్నారు. ప్రపంచ నియంతల చరిత్రలో ముఖ్యమంత్రి కేసీఆర్ మొదటి స్థానంలో నిలుస్తున్నాడని చెప్పారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణ కావాలని కొట్లాడితే కేవలం తన కుటుంబంతో పాటు అనుయాయులకు మేలు చేసుకునే విధంగా రాజ్యాంగ పరమైన నిర్ణయాలు తీసుకుంటున్నాడని దుయ్యబట్టారు. ఉమ్మడి పాలన కంటే ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భావం తర్వాత ప్రత్యేక రాష్ట్రంలో ఆర్టీసీని దివాలా తీయించారన్నారు. దీనిపై కార్మికులు గర్జిస్తుంటే సమ్మెను తప్పుదారి పట్టించేందుకు అనేక కుట్రలు పన్నుతూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులను 144 సెక్షన్‌తో తొక్కిపడేస్తూ ప్రైవేట్‌పరం చేసేందుకు లోలోపల అంతా సిద్ధం చేసుకున్నారన్నారు. నియంత పాలనతో విసుగుపుట్టిన ప్రజలు తమ ప్రతి స్పందన చూపించబోతున్నారని పొన్నాల అన్నారు. వేతనాలు ఇవ్వకుండా ఆర్టీసీ కార్మికులను పస్తులుంచిన కేసీఆర్‌కు తగిన బుద్ధి చెప్పే సమయం దగ్గరలోనే ఉందని చెప్పారు. హన్మకొండ హంటర్ రోడ్డు ఆర్టీసీ పరిధిలోని రీ ట్రేడింగ్ సెంటర్‌ను కరీంనగర్‌కు బదిలీ చేసి. రూ.100 కోట్ల విలువైన భూమిని కేసీఆర్ తన అనుయాయులకు అప్పగించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

మహారాష్ట్ర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

ముంబయి,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలోని ముంబయి-పుణెళి జాతీయ రహదారిపై సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కోల్హపూర్ ప్రాంతంలోని కామ్‌షెట్ గ్రామంలో ట్రక్కును బస్సు ఢీకొట్టడంతో ముగ్గురు ఘటనా స్థలంలో ముగ్గురు మృతి చెందారు. ఈ ప్రమాదంలో మరో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. స్థానిక డిఎస్‌పి నవ్‌నీత్ కన్వత్ ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో భారీ ట్రాఫిక్ జామ్!

– కాంగ్రెస్ నేతల ప్రగతిభవన్ ముట్టడి ఎఫెక్ట్
– ప్యారడైజ్ నుంచి బేగంపేట దారిలో గంటలకొద్దీ నిలిచిన వాహనాలు
– బేగంపేట మెట్రో మూసివేత
– తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణీకులు

హైదరాబాద్, అక్టోబర్21(ఆర్ఎన్ఎ) : ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రగతి భవన్ ముట్టడికి కాంగ్రెస్ పార్టీ పిలుపునివ్వడంతో నగరవాసులు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రగతి భవన్ ముట్టడికి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివస్తుండటంతో వారిని కట్టడి చేసేందుకు పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. దీంతో ప్రగతి భవన్‌కు దారితీసే ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది. ముఖ్యంగా సికింద్రాబాద్ నుంచి పంజాగుట్ట వెళ్లే దారిలో, ప్యారడైజ్‌నుంచి బేగంపేట వరకు ప్రస్తుతం వాహనాలు కదల్లేని పరిస్థితి నెలకొంది. సికింద్రాబాద్ నుంచి పంజాగుట్ట వెళ్లే మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ అవ్వడంతో వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. ఈ మార్గం మీదుగా ప్రగతి భవన్‌కు రాకుండా కాంగ్రెస్ శ్రేణులను నిలువరించేందుకు పోలీసులు బేగంపేటలో మోహరించారు. ఇక్కడ ఆందోళనకారులు కనిపించిన వెంటనే అదుపులోకి తీసుకొని వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. దీంతో సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి ప్రగతి భవన్ వరకు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

వాహనదారులు గంటలకొద్దీ రోడ్లపై తీవ్ర పడిగాపులు కాయాల్సి వచ్చింది. మరోవైపు ఈ మార్గంలోని మెట్రోరైల్ స్టేషన్లలోనూ పోలీసులు ఆంక్షలు విధించారు. నిరసనకారులు మెట్రో రైళ్లలో ప్రగతి భవన్‌కు చేరుకోకుండా ఎక్కడికక్కడ బలగాలను మోహరించారు.ఇక, సోమవారం నుంచి స్కూళ్లు పునఃప్రారంభం కావడంతో నగరంలో రద్దీ భారీగా పెరిగింది. నగరంలోని పలుచోట్ల ట్రాఫిక్ నిదానంగా కదిలింది. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రభుత్వం ప్రయాణికులు, స్కూలు విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా పలు ప్రత్యామ్యాయ చర్యలు తీసుకు ంది. నగరంలో చెప్పుకోదగిన స్థాయిలోని ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులు తిరుగుతున్నాయి. అయితే, ఇవి ఏమాత్రం సరిపోని పరిస్థితి కనిపించింది. ఆర్టీసీ బస్సులు తగినంత అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు పెద్దసంఖ్యలో సెట్విన్ బస్సులపై ఆధారపడ్డారు. దీంతో సెట్విన్లు చోటులేనంతగా కిక్కిరిసిపోయాయి. పలుచోట్ల సెట్విన్‌బస్సుల్లో మహిళలు సైతం ఫుట్‌బోర్డు ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

బేగంపేట మెట్రో మూసివేత..

కాంగ్రెస్ ఎంపీ రేవంత్ రెడ్డి ప్రగతి భవన్ ముట్టడినిస్తానని ప్రకటించిన నేపథ్యంలో బేగంపేట మెట్రోస్టేషన్‌ను మూసివేశారు. ప్రగతి భవన్‌కు సమీపంలోని బేగంపేట మెట్రోస్టేషన్ నుంచి ఆందోళన కారులు, కాంగ్రెస్ నాయకులు ప్రగతి భవన్‌కు చేరుకోవచ్చనే అనుమానంతో పోలీసుల ఆదేశాల మేరకు మెట్రోస్టేషన్‌లో రాకపోకలను నిలిపివేశారు. బేగంపేట మెట్రోస్టేషన్‌లో మెట్రోరైలును ఆపకపోవడంతో.. మెట్రోలో బేగంపేట ప్రధాన రైల్వేస్టేషన్‌కు రావల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అమీర్‌పేటలో మెట్రో ఎక్కిన ప్రయాణికులు బేగంపేటలో దిగాల్సి ఉన్నప్పటికీ వారిని ప్రకాశ్‌నగర్ మెట్రోస్టేషన్‌లో దింపారు. అదేవిధంగా ప్రకాశ్‌నగర్ వైపు నుంచి బేగంపేట రావాల్సిన ప్రయాణికులను అమీర్‌పేట మెట్రో స్టేషన్‌లో దించారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పరిశుభ్రతలో సిరిసిల్ల ముందుండాలి

30రోజుల ప్రణాళిక నిరంతరంగా సాగాలి
అధికారులతో సమీక్షలో మంత్రి కేటీఆర్

హైదరాబాద్,అక్టోబర్ 21 (ఆర్ఎన్ఎ): పరిశుభ్ర సిరిసిల్ల లక్ష్యంగా పారిశుద్ధ్య ప్రణాళికలు ఉండాలని మంత్రి కేటీఆర్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఆదర్శంగా ఉండేలా చూడాలని, చెత్తాచెదారం లేకుండా పట్టణంతో పాటు,పల్లెలు పచ్చగా ఉండాలన్నారు. శనివారం సిరిసిల్ల నియోజకవర్గంపై హైదరాబాద్‌లో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ.. గ్రామ పారిశుద్ధ్య ప్రణాళికలో భాగంగా రూపొందించిన కార్యక్రమాల అమలుపైన ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. 30 రోజుల గ్రామ ప్రణాళికను విజయవంతంగా పూర్తిచేసిన అధికారులు, ప్రజాప్రతినిధులకు మంత్రి అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని, గ్రామాల్లో ప్రజలను నిరంతరం చైతన్యం చేయాలన్నారు. గ్రామాల్లో తడిపొడి చెత్త వేరుచేయడం, డంపింగ్ యార్డులను ఏర్పాటు చేయడం, వ్యక్తిగత మరుగుదొడ్ల లక్ష్యాన్ని పూర్తి చేయడం వంటి వాటిపై శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రజారోగ్యానికి పెద్ద పీట వేయాలన్నారు. గ్రామాలు స్వచ్ఛంగా ఉన్నప్పుడే ఇది సాధ్యం అవుతుందన్నారు.

భారత్ - చైనా వ్యూహాత్మక చర్చలు కొనసాగాలి

– వివాదాలను పరిష్కరించుకునేందుకు కృషి జరగాలి
– ఇండియాలోని చైనా రాయబారి సన్ వీడాంగ్

న్యూఢిల్లీ,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): భారత్ - చైనా ఇరుదేశాలు తమ పరస్పర ప్రయోజనాలపై దృష్టి సారిస్తూ.. సమయానుసారంగా కీలకాంశాలపై వ్యూహాత్మక చర్చలు కొనసాగించాల్సిన అవసరం ఉందని ఇండియాలోని చైనా రాయబారి సన్ వీడాంగ్ అభిప్రాయపడ్డారు. అలాగే ప్రస్తుతం ఉభయ దేశాల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించుకునేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య జరిగిన భేటీలో ఈ అంశాలు చర్చకు వచ్చాయన్నారు. విభేదాలు వివాదాలుగా మారకుండా చూడాలన్న మోదీ పిలుపును ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. భారత్‌తో చైనా ఎప్పటికీ.. మెరుగైన సంబంధాల్నే కోరుకుంటోందన్నారు. అదే సమయంలో భారత్ - పాకిస్థాన్, చైనా - పాకిస్థాన్ సంబంధాలు కూడా బలంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఇటీవల సరిహద్దులో చోటుచేసుకున్న ఆందోళనల్ని ప్రస్తావిస్తూ.. ఈ విషయంపై ఇరు దేశాలు తమ అభిప్రాయాల్ని పంచుకున్నాయన్నారు. దీనిపై మరింత లోతుగా చర్చించాల్సి ఉందన్నారు. సరిహద్దు అంశాల్లో 2005లో ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే దీని అమలులో ఉన్న ఇబ్బందులపై చర్చించడానికి నియమించిన ప్రత్యేక ప్రతినిధుల బృందం తమ చర్చల్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సరిహద్దుల్లో శాంతియుత వాతావరణం కొనసాగించేందుకు కట్టుబడి ఉన్నామని ఇరు దేశాధినేతలు ఇటీవలి చర్చల్లో నొక్కిచెప్పారన్నారు. అక్టోబర్ 11-12 న జిన్‌పింగ్ భారత పర్యటనకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధాని మోదీతో ఆయన చెన్నై సమీపంలోని మామల్లాపురంలో భేటీ అయ్యారు. అక్కడి చరిత్రాత్మక ప్రదేశాలను వీక్షించడంతో పాటు పలు ద్వైపాక్షిక అంశాలపై కీలక చర్చలు జరిపారు.

24నుంచి శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి పవిత్రోత్సవాలు

గోడపత్రికలు ఆవిష్కరించిన టిటిడి జెఇవో

తిరుపతి,అక్టోబర్ 21(ఆర్ఎన్ఎ): శ్రీనివాసమంగాపురంలో కొలువైన శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఈనెల 24 నుండి 26వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరుగనున్నాయి. దీనికి సంబంధించి గోడపత్రికలను జెఈవో పి.బసంత్‌కుమార్ ఆవిష్కరించారు. తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలోని కార్యాలయంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జెఈవో మాట్లాడుతూ23వ తేదీన సాయంత్రం 6.00 గంటలకు మత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, అంకు రార్పణంతో ఈ ఉత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభవుతాయన్నారు. పవిత్రోత్సవాల్లో మొదటిరోజైన అక్టోబరు 24వ తేదీన రాత్రి 7.00 నుండి 8.30 గంటల వరకు పవిత్రప్రతిష్ఠ, రెండవ రోజు అక్టోబరు 25వ తేదీన మధ్యాహ్నం 12.00 నుండి 1.00 గంట వరకు పవిత్ర సమర్పణ చేస్తారన్నారు. చివరిరోజైన అక్టోబరు 26వ తేదీ రాత్రి 7.00 నుండి 8.00 గంటల వరకు పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగుస్తాయన్నారు.పవిత్రోత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు ఉదయం 10.00 నుండి 11.30 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహిస్తారన్నారు. అదేవిధంగా ప్రతిరోజు సాయంత్రం 5.00 నుండి 6.00 గంటల వరకు స్వామి, అమ్మవార్లు ఆలయ నాలుగు మాడ వీధులలో ఊరేగి భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. గృహస్తులు(ఇద్దరు) రూ.500/- చెల్లించి ఒకరోజు పవిత్రోత్సవాల ఆర్జితసేవలో పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక పవిత్రమాల, ఒక ఉత్తరీయం, ఒక రవికె, అన్నప్రసాదం బహుమానంగా అందజేస్తారు. పవిత్రోత్సవాల కారణంగా అక్టోబరు 24 నుండి 26వ తేదీ వరకు ఆర్జిత కల్యాణోత్సవం, అష్టోత్తర శత కళశాభిషేకం సేవను టిటిడి రద్దు చేసింది. వైదిక సంప్రదాయం ప్రకారం జాతాశౌచం, మృతాశౌచం వంటి వేళల్లో ఆలయ ప్రవేశం నిషిద్ధం. అయినా యాత్రికుల వల్లగానీ, సిబ్బంది వల్ల గానీ తెలిసీతెలియక ఇటువంటి దోషాలు జరుగుతుంటాయి. వాటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా నివారించేందుకు ప్రతి ఏడాదీ పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ పవిత్రోత్సవాలలో వేదపఠనం, ఆలయశుద్ధి, పుణ్యాహవచనం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఈ కార్యక్రమంలో టిటిడి స్థానిక ఆలయాల డెప్యూటీ ఈవో యలప్ప, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ అనిల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

టీటీడీ ఛైర్మన్‌ను కలిసిన ఇంద్రకరణ్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్21(ఆర్ఎన్ఎ) : తెలంగాణ నుంచి తిరుమలకు వచ్చే భక్తులకు శ్రీవారి ప్రత్యేక దర్శనం కోసం సముచిత ప్రాధాన్యత కల్పించాలని అటవీ, దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని కోరారు. జూబ్లీహిల్స్‌లోని సుబ్బారెడ్డి నివాసంలో మంత్రి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ నుంచి రోజూ వేలాదిమంది భక్తులు తిరుమలేశుని దర్శనం కోసం వస్తుంటారని, ఇక్కడి భక్తులకు ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించాలని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి విజ్ఞప్తిచేశారు.

ఇతరుల విజయాలను..

తక్కువచేయటం సరికాదు

– కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక వాద్రా

న్యూఢిల్లీ, అక్టోబర్21(ఆర్ఎన్ఎ) : బీజేపీ నేతలు తాము చేయాల్సిన పని చేయకుండా, ఇతరులు సాధించిన విజయాలను తక్కువ చేసి మాట్లాడటం తగదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక వాద్రా పేర్కొన్నారు. నోబెల్ బహుమతి గ్రహీత అభిజిత్ బెనర్జీపై కేంద్ర మంత్రి ప్రియూష్ గోయల్ చేసిన వ్యాఖ్యలను ప్రియాంక తప్పుబట్టారు. సొంత పనులు మానేసి ఇతరుల విజయాలను చులకన చేసి మాట్లేందుకు బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. నోబెల్ బహుమతి గ్రహీత (అభిజిత్ బెనర్జీ) నిజాయితీగా తన పని తాను చేశారని, బహుమతి గెలుచుకున్నారని అన్నారు. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందని, మీ (బీజేపీ నేతలు) పని ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడమని, కామెడీ సర్కస్ చేయడం కాదుంటూ హిందీలో పోస్ట్ చేసిన ఓ ట్వీట్‌లో ప్రియాంక చురకలు వేశారు. ట్వీట్‌తో పాటు పండుగ సీజన్ అయినప్పటికీ సెప్టెంబర్‌లోనూ ఆటోమొబైల్ రంగంలో మందగమనం కొనసాగుతోందంటూ వచ్చిన మీడియా రిపోర్ట్‌ను కూడా ఆమె జత చేశారు. ప్రముఖ ఆర్థిక వేత్త ప్రొఫెసర్ అభిజిత్ బెనర్జీ నోబెల్ బహుమతి గెలుచుకోవడం అభినందనీయమని కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ పేర్కొంటూనే, ఆయన వామపక్షవాది అంటూ తప్పుపట్టారు. కాంగ్రెస్ పథకమైన 'న్యాయ్'ను అభిజిత్ సమర్థించారని, అయితే భారత ప్రజలు ఆయన భావజాలాన్ని తిరస్కరించారని వ్యాఖ్యానించారు. అభిజిత్ బెనర్జీ ఇటీవల భారత ఆర్థిక వ్యవస్థ అస్థిరంగా ఉందని, ప్రస్తుత గణాంకాల ప్రకారం దేశ ఆర్థిక వ్యవస్థ సమీప భవిష్యత్తులో పుంజుకునే అవకాశం లేదని విశ్లేషించారు.

నిండుకుండలా శ్రీరాంసాగర్

– మూడేళ్ల తర్వాత ప్రాజెక్టు నుంచి దిగువకు నీటి విడుదల

నిజామాబాద్, అక్టోబర్21(ఆర్ఎన్ఎ) : మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో వస్తున్న వరద కారణంగా ఉత్తర తెలంగాణ వరప్రధాయని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. మూడేండ్ల తర్వాత ప్రాజెక్టు నుంచి దిగువకు వదులుతున్నారు. వానకాలం సీజన్ ప్రారంభమైన జూలై, ఆగస్టు నెలల్లో ప్రాజెక్టుకు ఆశించిన స్థాయిలో వరద రాలేదు. సెప్టెంబర్‌లో భారీగా ఇన్‌ఫ్లోలో కొనసాగడంతో క్రమేపీ జలకళ సంతరించుకొన్నది. ఎగువన మహారాష్ట్రలోని విష్ణుపురి, బాలేగావ్, అముదుర, గైక్వాడ్, బాబ్లీ ప్రాజెక్టులు నిండటంతో దిగువకు నీటిని వదిలారు. దీనికితోడు నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లోని గోదావరి పరీవాహకంలో భారీగా వర్షాలు కురవడంతో ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకొన్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (90.313 టీఎంసీలు) కాగా, ఆదివారం రాత్రికి ప్రాజెక్టు నీటిమట్టం 1091.00 అడుగులకు చేరుకొన్నది. దీంతో అధికారులు కాకతీయ కాల్వకు నీటిని వదిలారు. కాల్వకు అనుసంధానంగా ఉన్న జలవిద్యుదుత్పత్తి కేంద్రంలోని మూడు టర్బయిన్లతో 22.8 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. గోదావరిలోకి ఎనిమిది గేట్లు ఎత్తి దిగువకు 25వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. గోదావరి పరీవాహిక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక రెవెన్యూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రాజెక్టులోకి 60వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందని అధికారులు వెల్లడించారు. సాయంత్రం వరకు మరిన్ని గేట్లు ఎత్తేసి దిగువకు నీటిని వదలనున్నట్లు అధికారులు తెలిపారు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

జగిత్యాల,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): జిల్లాలోని మేడిపల్లి మండల కేంద్రం శివారులో రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో గోనెపల్లి శేఖర్‌గౌడ్ పెద్ద కొడుకు గోనెపల్లి యశ్వంత్‌గౌడ్, ఠాకూర్ సైలెందర్‌సింగ్‌లు మృతి చెందారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు.

లోయలో పడ్డ బస్సు: ఒకరు మృతి

ఖమ్మం జిల్లాలో సోమవారం ఉదయం బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. టిఎస్ 07యుజి 4567 అనే నంబర్ గల బస్సు బోల్తా పడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

బిజెపిలో చేరిన ఆదినారాయణ రెడ్డి

న్యూఢిల్లీ,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): టిడిపి సీనియర్ నేత, మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి బిజెపిలో చేరారు. బిజెపి వర్కింగ్ ప్రెసిడెంట్ జెపి నడ్డా సమక్షంలో ఆయన బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. ఆదినారాయణరెడ్డికి నడ్డా బిజెపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆదినారాయణరెడ్డి 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జమ్మలమడుగు నుంచి వైసిపి ఎంఎల్‌ఎగా గెలుపొందారు. అనంతరం ఆయన టిడిపిలో చేరారు. ఈ క్రమంలో ఆయన మంత్రి అయ్యారు. ఈ సందర్భంగా ఆదినారాయణరెడ్డి మాట్లాడారు. ఎపిలో బిజెపి బలోపేతానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. దేశంలో ప్రధాని నరేంద్ర మోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితుడినై బిజెపిలో చేరినట్టు ఆయన తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఎపిలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య

సెల్ఫీ వీడియోతో స్నేహితులకు సమాచారం

మేడ్చెల్,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): మేడ్చల్ జిల్లా కూకట్ పల్లి ప్రాంతం దయారుగూడలో ఓ యువకుడు సెల్ఫీ వీడియో తీసి అనంతరం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. రాజు అనే యువకుడు చనిపోయే ముందు అతను సెల్ఫీ వీడియో తీసి తన స్నేహితులకు పంపినట్టు సమాచారం. జీవితంలో విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు రాజా వీడియోలో తెలిపాడు. రాజా ఎసి మెకానిక్ గా పని చేస్తున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు తూర్పు గోదావరి జిల్లా జొన్నాడ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

తల్లికి ఉరేసి చంపి...ఆపై ఆత్మహత్య

ఢిల్లీలో ఓ ప్రొఫెసర్ ఘాతుకం

న్యూఢిల్లీ,అక్టోబర్21(ఆర్ఎన్ఎ): ఓ ప్రొఫెసర్ తన తల్లిని ఉరేసి చంపి అనంతరం రైలు ముందు దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఢిల్లీలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అలెన్ స్టాన్లీ (27) అనే వ్యక్తి సెయింట్ స్టిఫెన్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పని చేస్తూ ఐఐటి ఢిల్లీలో ఫిలాసఫీలో పిహెచ్‌డి చేస్తున్నాడు. పిటమ్‌పూరాలో స్టాన్లీ తన తల్లి లిస్సీ నోట్లో గుడ్డలు పెట్టి ఉరేసి చంపే అనంతరం అతడు సరాయి రోహిల్ల రైల్వే స్టేషన్ సమీపంలో రైలు ముందు దూకి ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అలెన్ గత కొన్ని రోజులనుంచి నిరాశ, మనోవేదనతో బాధపడుతున్నాడని బంధువులు, స్నేహితులు తెలిపారు. స్టాన్లీ చనిపోతూ నాలుగు పేజీల సూసైడ్ లెటర్ రాశాడు. లిస్సీ మొదటి భర్త ఆర్మీలో పని చేసేవాడు. ఈ దంపతులకు అలెన్, అబిన్ ఇద్దరు కుమారులు ఉన్నారు. మొదటి భర్త 2014లో చ